సోమవారం 03.08.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 103 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నాయకత్వంలో పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగ కల్పనలో అధికారిక రికార్డులే విజయాలకు నిదర్శనం. వైసీపీ ఐదేళ్ల పాలనలో తీసుకొచ్చిన పరిశ్రమలు, ఆకర్షించిన పెట్టుబడులు, కల్పించిన ప్రైవేట్ ఉద్యోగాలపై ఇప్పటికీ సమాధానం లేదు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**

## ఏపీ-ఆస్ట్రేలియా.. అభివృద్ధి బాటలో కలయిక


- క్లీన్ఎనర్జీ నుంచి మానసిక ఆరోగ్యం వరకు నాలుగు కీలక ఒప్పందాలు
- అంతర్జాతీయ భాగస్వామ్యంతో రాష్ట్రానికి కొత్త అవకాశాలు



**ఉండవల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్– ఆస్ట్రేలియా భాగస్వామ్యంలో నూతన అధ్యాయం ప్రారంభమైంది. క్లీన్ ఎనర్జీ, అడ్వాన్స్ డ్ మ్యానుఫ్యాక్చరింగ్, సమ్మిళిత విద్య, విద్యార్థుల మానసిక ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాల్లో భారత్–ఆస్ట్రేలియా సహకారాన్ని మరింత బలోపేతం చేస్తూ ఏపీ ప్రభుత్వం.. ఆస్ట్రేలియాలోని ప్రముఖ విద్య, పరిశోధన, పారిశ్రామిక సంస్థలతో నాలుగు వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. శనివారం ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్, ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య, అంతర్జాతీయ అభివృద్ధి, బహుళ సాంస్కృతిక వ్యవహారాల సహాయ మంత్రి జూలియన్ హిల్ సమక్షంలో ఎంవోయూలపై ఇరుపక్షాల ప్రతినిధులు సంతకాలు చేశారు.


**నారా లోకేష్ ఆస్ట్రేలియా టూర్..ఎంవోయూలు షురూ :** విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఇటీవల ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా అక్కడి విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమల ప్రతినిధులతో జరిపారు. ఏపీకి రావాలని ఆస్ట్రేలియా ప్రభుత్వానికి ఆహ్వానం పలికారు. ఏపీలో అవకాశాలు, ఇస్తున్న రాయితీలను వివిధ సంస్థల ప్రతినిధులకు వివరించారు. దీనిపై అప్పుడే సానుకూలంగా స్పందించారు ఆస్ట్రేలియా ప్రతినిధులు. మంత్రి నారా లోకేష్ ఆస్ట్రేలియా టూర్ వల్లే కీలకమైన ఎంవోయూలు జరిగాయి.

**ఐఐటీ తిరుపతిలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విశాఖ లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (జశీజుజు), ఐఐటీ తిరుపతి, ఆస్ట్రేలియాలోని సిడ్నీకి చెందిన యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ (ఖచీూఔ) కలిసి ఐఐటీ తిరుపతిలో సోలార్ తయారీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను ఏర్పాటుచేయనున్నారు. మిగతా 2లో...



## కుప్పం నుంచి కార్గో టేకాఫ్!

- వెయ్యి ఎకరాల్లో విమానాశ్రయం, ఇండస్ట్రియల్ హబ్ నిర్మాణం
- చంద్రబాబు హామీతో వేగం పుంజుకున్న పనులు
- కుప్పంలో కార్గో విమానాశ్రయానికి వేగంగా అడుగులు
- త్వరలో భూమిపూజకు సన్నాహాలు




**కుప్పం(జర్నలిస్ట్ ఫైల్):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలో కార్గో విమానాశ్రయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోంది. చిత్తూరు జిల్లా శాంతిపురం, రామకుప్పం మండలాల సరిహద్దులోని రామాపురం వద్ద విమానాశ్రయం నిర్మించాలని నిర్ణయించగా, భూసేకరణతో పాటు మౌలిక సదుపాయాల కల్పన పనులను అధికారులు వేగవంతం చేశారు.

విజయనగరం జిల్లాలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమైన నేపథ్యంలో కుప్పంలోనూ త్వరలో విమానాశ్రయ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది. వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ రంగాల ఉత్పత్తుల రవాణాకు అనుకూలంగా కార్గో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. మిగతా 2లో...

## డ్రగ్స్‌పై దేశవ్యాప్త పోరు

- 'నషా ముక్త్ యువ'కు ప్రధాని మోదీ శ్రీకారం
- ఆరోగ్యవంతమైన యువతతోనే 'వికసిత్ భారత్' సాధ్యమని వ్యాఖ్య



**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** యువతకు డ్రగ్స్ పీడ వదిలించే దిశగా ప్రధాని నరేంద్ర మోదీ నషా ముక్త యువ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా యువతలో స్ఫూర్తి నింపేందుకు ఒక సమగ్ర ప్రచారకార్యక్రమంగా 'నషా ముక్త యువ'ను ప్రారంభించామని ప్రధాని తెలిపారు. తాముంటున్న ప్రాంతాల్లో సానుకూల మార్పులకు కారకులుగా యువత నిలవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చామని ప్రధాని చెప్పారు.

వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాకారం చేసుకునేందుకు దేశ యువత ఆరోగ్యంగా ఉండటం అవసరమని ప్రధాని అన్నారు. ఈ కార్యక్రమం వ్యక్తులకే కాకుండా కుటుంబాలు, దేశ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని రూపొందించామని అన్నారు. గతేడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయాన్ని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇది దేశవ్యాప్తంగా అమలయ్యే స్థాయికి విస్తరించిందని చెప్పారు. ఈ క్యాంపెయిన్‌లో 125 ఆధ్యాత్మిక సంస్థలు కూడా చేరాయని చెప్పారు. డ్రగ్స్ రహిత సమాజం దిశగా కృషి చేస్తున్నాయని అన్నారు.

'కొన్ని పనులను పూర్తి చేసేందుకు ఒక వ్యక్తి సామర్థ్యం సరిపోదు. ఇలాంటి విషయాల్లో ఒంటరిపోరాటంతో అలసట, నిస్పృహ ఆవరిస్తాయి. కానీ అనేక మంది కలికట్టుగా రంగంలోకి దిగితే ఆ ఐక్యత నుంచి స్ఫూర్తి పొంది లక్ష్యాన్ని సాధించవచ్చు' అని ప్రధాని అన్నారు. ఇప్పటికే లక్షలాది మంది యువత మిగతా 2లో...

## పులుల సంరక్షణపై హైపవర్డ్ కమిటీ

- పవన్ కళ్యాణ్ ఆదేశాలతో ఐదుగురు సభ్యుల కమిటీ ఏర్పాటు
- నల్లమలలో పులి మృతిపై సమగ్ర అధ్యయనం..
- సంరక్షణకు కార్యాచరణ నివేదిక



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పులులే అడవులకు ప్రాణం... అడవులే ప్రకృతి సమతుల్యతకు ఆధారం. పులుల సంరక్షణలో ఎలాంటి రాజీ ఉండకూడదన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ--పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు దేశంలోనే అతి పెద్ద పులుల ఆవాసాలలో ఒకటైన నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ (ఎన్ఎస్ఎస్టీఆర్)లో పులుల సంరక్షణ వ్యవస్థను సమగ్రంగా సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణకు మార్గదర్శకాలను రూపొందించేందుకు హైపవర్డ్ కమిటీని ఏర్పాటు చేశారు. మిగతా 2లో...



## గోదావరి పోటెత్తింది!

- ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగింపు
- లంక గ్రామాలకు రాకపోకలు నిలిచివేత..
- ముంపు ప్రాంతాల ప్రజల తరలింపు

2లో

## మత్తుపై మహా ఉద్యమం

- 100 వారాల 'నషా ముక్త్ యువ' కార్యక్రమాన్ని స్వాగతించిన లోకేష్
- డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా 'ఈగల్' బృందం కృషి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన 'నషా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమాన్ని స్వాగతిస్తూ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, డ్రగ్స్ నిర్మూలన కోసం దేశవ్యాప్తంగా 100 వారాల పాటు కార్యక్రమాన్ని జాతీయ ఉద్యమంగా నిర్వహించాలని ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపు అభినందనీయమన్నారు. ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మిగతా 2లో...

## నీట్ కౌన్సెలింగ్ షురూ!




- ఆగస్టు 4 నుంచి తొలి విడత..
- విడుదలైన పూర్తి షెడ్యూల్
- గడువులు మిస్ కాకుండా ముందుగానే సన్నద్ధం కావాలని సూచన
- డా. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప కులపతి పులాల చంద్రశేఖర్

2లో

## సకాలంలో పన్నుల్లో వాటా... అభివృద్ధికి ఊతం

- అదనపు పన్నుల వాటా కేటాయింపుపై ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అదనపు పన్నుల వాటా కేటాయింపుపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. సాధారణంగా ప్రతి నెలా 10వ తేదీన విడుదలయ్యే పన్నుల వాటాతో పాటు అదనంగా రూ.4,597 కోట్ల పన్నుల వాటాను కేటాయించినందుకు ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ ఎక్స్ వేదికగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వం చేసిన పన్నుల వాటా కేటాయింపుతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత బలం చేకూరుస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల తరపున ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. అదనపు పన్నుల వాటా విడుదలతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల అమలు మరింత వేగవంతం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏపీ అభివృద్ధికి నిరంతరం అందిస్తున్న సహకారం రాష్ట్ర పురోగతికి ఎంతో దోహదపడుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## అవయవ మార్పిడి ఇక చేరువలో

- ప్రభుత్వ బోధనాసుపత్రుల బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ
- 12 ప్రభుత్వాసుపత్రుల్లో ట్రాన్స్‌ప్లాంట్ సేవల విస్తరణ
- వైద్య సదుపాయాల విస్తరణపై మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటన





**విశాఖ(జర్నలిస్ట్ ఫైల్) :** పేదలను దృష్టిలో పెట్టుకొని అవయవ మార్పిడి చికిత్సలు బోధనాసుపత్రుల్లోనూ ఎక్కువగా జరిగేందుకు వీలుగా ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడిశీచారు. రాష్ట్రంలోని 12 ప్రభుత్వాసుపత్రులను దశలవారీగా పూర్తి స్థాయి అవయవ మార్పిడి కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా ఆదివారం విశాఖలోని ఏ యు కన్వెన్షన్ సెంటర్ లో జీవన్ దాన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి అవగాహన కార్యకమంలో మిగతా 2లో...

## రైతే తొలి ప్రాధాన్యం



- సాగునీటి పంపిణీ, ఎరువుల సరఫరాలో నిర్లక్ష్యం వద్దు
- రైతు ప్రయోజనాల విషయంలో రాజీ ఉండదన్న మంత్రి అచ్చెన్నాయుడు

2లో

## కుప్పం నుంచి కార్గో టేకాఫ్!



(మొదటి పేజీ తరువాయి)

విమానాశ్రయం టెర్మినల్, రన్‌వే నిర్మాణానికి సుమారు 500 ఎకరాలు కేటాయించగా, మరో 500 ఎకరాల్లో పారిశ్రామిక యూనిట్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గత నెల కుప్పం పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తదుపరి పర్యటనలో విమానాశ్రయానికి భూమిపూజ చేస్తామని ప్రకటించడంతో అధికార యంత్రాంగం కార్యాచరణను వేగవంతం చేసింది.

**వెయ్యి ఎకరాల భూసేకరణ :** విమానాశ్రయం, పారిశ్రామిక అభివృద్ధి కోసం శాంతిపురం, రామకుప్పం మండలాల్లో మొత్తం వెయ్యి ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరిస్తోంది. 2014-19లో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే విమానాశ్రయానికి 500 ఎకరాల భూమి సేకరించి రైతులకు పరిహారం చెల్లించారు. 2019 జనవరిలో రామాపురంలో విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన కూడా జరిగింది. ప్రస్తుతం అదనంగా మరో 500 ఎకరాల భూమిని సేకరిస్తుండగా, పలువురు రైతులకు ఇప్పటికే పరిహారం అందించినట్లు అధికారులు తెలిపారు.

**అప్రోచ్ రోడ్ల నిర్మాణం :** విమానాశ్రయానికి మెరుగైన రహదారి అనుసంధానం కల్పించేందుకు పలమనేరు--కృష్ణగిరి జాతీయ రహదారి (ఎన్‌హెచ్-42) నుంచి రెండు అప్రోచ్ రోడ్లను నిర్మించనున్నారు. ఇందుకోసం మొత్తం 129 ఎకరాల భూమిని సేకరిస్తున్నారు.

శాంతిపురం సమీపంలోని జాతీయ రహదారి నుంచి అమ్మవారిపేట వరకు 5.5 కిలోమీటర్ల పొడవున మొదటి అప్రోచ్ రోడ్డును నిర్మించనుండగా, దీనికి 51.42 ఎకరాల భూమి అవసరమవుతోంది. గుండిశెట్టిపల్లె--సొన్నేగానిపల్లె--కిలాకిపోడు మీదుగా రెండో అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి 49.23 ఎకరాలు సేకరిస్తున్నారు. ఈ రెండు రోడ్లను అనుసంధానించే కనెక్టింగ్ రోడ్డుకు మరో 25 ఎకరాల భూమిని సమీకరించే ప్రక్రియ సొన్నేగానిపల్లె, దండికుప్పం రెవెన్యూ పరిధిలో కొనసాగుతోంది.

విమానాశ్రయంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను ఒకే ప్రాంతంలో కల్పించడం ద్వారా కుప్పాన్ని దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లో కీలక కార్గో, పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

## డ్రగ్స్‌పై దేశవ్యాప్త పోరు

(మొదటి పేజీ తరువాయి)

ఇక డ్రగ్స్ జోలికి వెళ్లబోమని ప్రతినబూనారని చెప్పారు.

ఈ కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్‌తో కలిగే ముప్పుపై ప్రచార కార్యక్రమాలను దేశవ్యాప్తంగా ప్రతి ఆదివారం నిర్వహించనున్నారు. దీంతో, పాటు యువతలో ఆత్మస్థైర్యం, క్రమశిక్షణ పెంపొందించేందుకు రకరకాల క్రీడా కార్యక్రమాలు, వాకథాన్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చలతో పాటు సామాజిక స్థాయిలో కూడా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## మత్తుపై మహా ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'డ్రగ్స్ వద్దు బ్రో' పేరుతో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ఈగల్ పేరుతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, సమాజ భాగస్వామ్యంతో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని, డ్రగ్స్ నిర్మూలనలో ప్రజల సహకారం అత్యంత కీలకమని నారా లోకేష్ అన్నారు. ప్రభుత్వం, ప్రజలు, యువత కలిసి పనిచేస్తే మత్తు రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## రైతే తొలి ప్రాధాన్యం



**కోటబొమ్మాళి (జర్నలిస్ట్ ఫైల్) :** ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఎక్కడా ఇబ్బందులు పడకుండా సాగునీరు, ఎరువుల సరఫరాను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఆహార ప్రాసెసింగ్, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రైతుల అవసరాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, వారి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

ఖరీఫ్ ప్రారంభానికి ముందుగానే సాగునీటి పంపిణీపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించి, ముఖ్యంగా కాలువల చివరి ఆయకట్టు ప్రాంతాలకు తొలి ప్రాధాన్యంతో నీటిని అందించాలని ఇప్పటికే పలుమార్లు ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నిర్లక్ష్యం కనిపిస్తోందని, దీనిపై అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

ఈ సందర్భంగా అధికారులు మంత్రికి ప్రస్తుత సాగునీటి పరిస్థితిని వివరించారు. ఇస్తున్న ఇన్‌పుట్ ఆధారంగా రైతులకు సాగునీటిని విడుదల చేస్తున్నామని, కాలువల వారీగా నీటి పంపిణీని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి, కేవలం నివేదికలకే పరిమితం కాకుండా ప్రతి రైతుకు సమయానికి నీరు చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.

అదేవిధంగా ఎరువుల సరఫరాపైనా ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, పంపిణీ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత, అధిక ధరలకు విక్రయాలు వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.

సాగునీరు, ఎరువుల పంపిణీ విషయంలో రైతుల నుంచి ఒక్క ఫిర్యాదు కూడా రాకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. మండల, జిల్లా స్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రైతుల సమస్య పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని, రైతు సంతృప్తే అధికారుల పనితీరుకు కొలమానమని పేర్కొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, పంటల సాగుకు అవసరమైన ప్రతి సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని మంత్రి తెలిపారు. ఖరీఫ్ సీజన్ విజయవంతం కావాలంటే అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, రైతు ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ఆయన స్పష్టం చేశారు.

# ఏపీ-ఆస్ట్రేలియా.. అభివృద్ధి బాటలో కలయిక

(మొదటి పేజీ తరువాయి)

ఈ భాగస్వామ్యం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను సోలార్ తయారీ పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞాన వాణిజ్యీకరణకు జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతిపాదిత సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అధునాతన సోలార్ పీవీ తయారీ, సోలార్ ప్యానెళ్ల రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ విధానాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన పరిశోధనలు, అధ్యాపకుల సామర్థ్య అభివృద్ధి, ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలపై దృష్టి సారించనున్నారు. సోలార్ ఫోటోవోల్టాయిక్(ౘపి) తయారీ, సర్క్యులారిటీ రంగాల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా డిగ్రీయేతర విద్య, శిక్షణా కార్యక్రమాలు రూపొందించడం, అభివృద్ధి చేయడం, అమలుచేయడంలో యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ తన సహకారాన్ని అందించనుంది. సోలార్ సెల్ డివైజ్ ఫిజిక్స్, సోలార్ సెల్ మ్యానుఫ్యాక్చరింగ్, క్యారెక్టరైజేషన్, రిలయబిలిటీ ఇంజనీరింగ్, రీసైక్లింగ్, భద్రత, నిర్వహణ, ఇన్ గాట్ తయారీ, వాఫరింగ్ సాంకేతికతలు వంటి అంశాలపై కరిక్యులమ్, లెర్నింగ్ మెటీరియల్స్, అసెస్ మెంట్ ఫ్రేమ్ వర్క్, ట్రైనింగ్ కంటెంట్ ను రూపొందించనుంది.

**సమ్మిళత విద్య బలోపేతం కోసం.. :** యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఏపీ సమగ్ర శిక్ష సంయుక్తంగా సమ్మిళిత విద్యను బలోపేతం చేసేందుకు మరో ఎంవోయూ చేసుకున్నాయి. ఆటిజం, ఇతర న్యూరోడైవర్స్ విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని



పెంపొందించడం ఈ భాగస్వామ్యం ప్రధాన లక్ష్యం. స్పెషల్ ఎడ్యుకేటర్స్ కు ప్రత్యేక శిక్షణ, సాధారణ ఉపాధ్యాయులకు శాస్త్రీయ ఆధారిత శిక్షణ, ఆంధ్రప్రదేశ్ విద్యార్థుల అవసరాలకు అనుగుణమైన బోధనా వనరుల రూపకల్పన చేపట్టనున్నారు.

**విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణ కోసం పైలట్ ప్రాజెక్ట్ :** మూడో ఒప్పందం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, ఆస్ట్రేలియాకు చెందిన రీబౌండ్ డింపుల్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా రాష్ట్రంలోని ఎంపిక చేసిన ఉన్నత విద్యాసంస్థల్లో సాంకేతిక ఆధారిత విద్యార్థుల మానసిక ఆరోగ్యం, సమగ్ర శ్రేయస్సుకు తోడ్పాటునందించే పైలట్ ప్రాజెక్టు చేపట్టనున్నారు. ఈ వేదిక ద్వారా విద్యార్థులు తమ గోప్యతకు భంగం కలగకుండా మానసిక ఆరోగ్య సమాచార వనరులు, వెల్‌నెస్ అసెస్ మెంట్ టూల్స్, వర్చువల్ కౌన్సెలింగ్ సేవలను పొందగలుగుతారు. పైలట్ కార్యక్రమంలో పాల్గొనే విద్యాసంస్థలకు ఉచితంగా అమలు చేయనున్నారు.

**వృత్తి విద్య, నైపుణ్యాభివృద్ధికి డీఎల్ఎస్ తో ఎంవోయూ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆస్ట్రేలియాకు చెందిన డైనమిక్ లెర్నింగ్ సర్వీసెస్ వృత్తి విద్య, నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన శిక్షణా కార్యక్రమాల్లో పరస్పర సహకారాన్ని అందించడానికి 4వ ఎంవోయూ జరిగింది. ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ అందించడం, విద్యా సంస్థలు-పరిశ్రమల మధ్య బలమైన అనుసంధానం ఏర్పరచడం ఈ భాగస్వామ్యం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. ఎంవోయూలకు ముందు ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య, అంతర్జాతీయ అభివృద్ధి, బహుళ సాంస్కృతిక వ్యవహారాల సహాయ మంత్రి జూలియన్ హిల్ సహా ఇతర ఆస్ట్రేలియా ప్రతినిధి బృందాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, ఏపీలో గల విస్తృత అవకాశాలను వివరించారు. అనంతరం జూలియన్ హిల్ ను సీఎం చంద్రబాబునాయుడు శాలువాతో సత్కరించారు. అరకు కాఫీని, ప్రత్యేక జ్ఞాపికను బహూకరించారు.

ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య కమిషనర్ తమీమ్ అన్సారియా, రాష్ట్ర ఉన్నత విద్య కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, స్కిల్ డెవలప్ మెంట్ శాఖ ఎండీ గణేష్ కుమార్, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ డా.సత్యనారాయణ్, పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ వి.ఉమా, చెన్నైలో ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ సిలై జాకీ, సహాయ కార్యదర్శి డా. డామియన్ ఒలివర్, మంత్రి సలహాదారు జార్జ్ థివియోస్, హోమ్ అఫైర్స్ రీజనల్ డైరెక్టర్ స్టీవెన్ స్టీవెన్ బిడిల్, ప్రథమ కార్యదర్శి అలిసన్ మస్ గ్రోవ్, యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ ప్రొ వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ లీసా జాంబర్లాన్, రీబౌండ్ వ్యవస్థాపకులు టాడ్ కింగ్, డైనమిక్ లెర్నింగ్ సర్వీసెస్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ మేనేజర్ మ్యాక్సిమిలియన్ మెక్ కలఫ్ పాల్గొన్నారు.

# నీట్ కౌన్సెలింగ్ షురూ!

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** నీట్-యూజీ 2026 ప్రవేశాలకు సంబంధించి అఖిల భారత కోటా, డీమ్డ్ యూనివర్సిటీలు, కేంద్ర విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర కోటా కౌన్సెలింగ్‌కు సంబంధించిన షెడ్యూల్ ఖరారైందని డా. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప కులపతి పులాల చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

విద్యార్థులు, తల్లిదండ్రులు కౌన్సెలింగ్ ప్రక్రియకు సంబంధించిన తేదీలను గమనించి, నిర్దేశిత గడువులో అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.

నీట్-యూజీ 2026లో తొలి విడత అఖిల భారత కోటా కౌన్సెలింగ్ ఆగస్టు 4 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నారన్నారు. అఖిల భారత కోటాలో చేరిన అభ్యర్థుల వివరాల ధృవీకరణ ఆగస్టు 23న జరుగుతుందన్నారు. రాష్ట్ర కౌన్సెలింగ్ ప్రక్రియ ఆగస్టు 13 నుంచి 22వ తేదీ వరకు కొనసాగనుండగా, చేరిన అభ్యర్థుల వివరాల రాష్ట్రస్థాయి ధృవీకరణ ఆగస్టు 29న నిర్వహించనున్నారన్నారు.

తొలి విడత అఖిల భారత కోటా కౌన్సెలింగ్‌లో చేరేందుకు ఆగస్టు 22, 2026 చివరి తేదీ కాగా, రాష్ట్ర కౌన్సెలింగ్‌కు సంబంధించి చేరికకు ఆగస్టు



28, 2026 చివరి తేదీగా నిర్ణయించారన్నారు.

రెండో విడత కౌన్సెలింగ్ అఖిల భారత కోటాలో ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 2 వరకు, రాష్ట్ర కోటాలో ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహించనున్నారన్నారు. రెండో విడతలో చేరేందుకు అఖిల భారత కోటాలో సెప్టెంబర్ 8, రాష్ట్ర కోటాలో సెప్టెంబర్ 14 చివరి తేదీలుగా నిర్ణయించారన్నారు.

మూడో విడత కౌన్సెలింగ్ అఖిల భారత కోటాలో సెప్టెంబర్ 10 నుంచి 18 వరకు, రాష్ట్ర కోటాలో సెప్టెంబర్ 16 నుంచి 26 వరకు నిర్వహించనున్నారన్నారు.

మూడో విడతలో చేరేందుకు అఖిల భారత కోటాలో సెప్టెంబర్ 26, రాష్ట్ర కోటాలో అక్టోబర్ 1 చివరి తేదీలుగా ఉన్నాయన్నారు.

స్ట్రే వేకెన్సీ రౌండ్ అఖిల భారత కోటాలో సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 3 వరకు, రాష్ట్ర కోటాలో అక్టోబర్ 3 నుంచి 5 వరకు నిర్వహించనున్నారు. ఈ రౌండ్‌లో కేటాయించిన అభ్యర్థులు అక్టోబర్ 10, 2026లోపు చేరాల్సి ఉంటుంది. నీట్ - యూజీ 2026 ద్వారా యూజీ కోర్సుల్లో విద్యా సంవత్సరం సెప్టెంబర్ 8, 2026 నుంచి ప్రారంభంకానుందన్నారు.

కౌన్సెలింగ్ ప్రక్రియకు సమయం పరిమితంగా ఉన్నందున, షెడ్యూల్‌ను సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్ని శనివారాలు, ఆదివారాలు, గెజిటెడ్ సెలవు దినాలను కూడా పని దినాలుగా పరిగణించాలని అన్ని సంబంధిత వైద్య కళాశాలలు, సంస్థలకు సూచించినట్లు ఉప కులపతి పి. చంద్రశేఖర్ ఆ ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులు కౌన్సెలింగ్‌కు సంబంధించిన ప్రతి దశలోనూ నిర్దేశిత తేదీలను తప్పనిసరిగా పాటించాలని, గడువు ముగిసిన తర్వాత అవకాశాలు పరిమితమయ్యే అవకాశం ఉన్నందున ముందుగానే అవసరమైన ధ్రువపత్రాలు, ఇతర వివరాలను సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు.

## గోదావరి పోటెత్తింది!

**భద్రాచలం (జర్నలిస్ట్ ఫైల్) :** భద్రాచలం వద్ద గోదావరికి వరద ప్రవాహం తగ్గగా.. ఆంధ్రాలోని రాజమండ్రి వద్ద ధవళేశ్వరం బ్యారేజీకి వరద తాకిడి పెరుగుతోంది. ఆదివారం ఉదయానికి బ్యారేజీ వద్ద నీటిమట్టం 14.90 అడుగులకు చేరింది. దీంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 14.52 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. గోదావరి ఉద్ధృతితో లంకగ్రామాల పరిధిలో నీటి ప్రవాహం పెరగగా.. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పలు లంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలు గ్రామాల్లోకి వరదనీరు చేరే ప్రమాదం ఉండటంతో ముందస్తుగా ముంపు ప్రాంతాల బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రస్తుతం భద్రాచలం వద్ద నది నీటిప్రవాహం 52.9 అడుగులకు తగ్గగా.. మూడో ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించుకున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముక్తేశ్వరంలోని తొగరుపాయ వద్ద ఎదురుబిడియం కాజ్ వే నీటమునిగింది. అలాగే కోనసీమ జిల్లాలో గోదావరి నదీ పాయలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. గౌతమి, వృద్ధగౌతమి, వశిష్ట, వైనతేయ నదులు ఉప్పొంగుతున్నాయి. చాకలిపాలెం సమీపంలో కనకాయలంక కాజ్ వే వరద నీటిలో మునిగిపోగా.. బూరుగులంక, అరిగెలవారిపేట, ఉడుముడి లంక, జి.పెదపూడి లంక, ఆనగాల లంక, పెదమల లంక, అయోధ్య లంక, మర్రిమూల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లంక గ్రామాల ప్రజలు మరపడవలలో రాకపోకలు సాగిస్తున్నారు.

## పులుల సంరక్షణపై హైపవర్డ్ కమిటీ

(మొదటి పేజీ తరువాయి)



దేశంలోనే అతిపెద్ద పులుల ఆవాసాలలో ఒకటిగా గుర్తింపు పొందిన నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలో ఇటీవల ఆడ పులి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటనను పవన్ కళ్యాణ్ తీవ్రంగా పరిగణించారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి, పులులు మరియు వాటి ఆవాసాల సమర్థవంతమైన సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను గుర్తించాలని నిర్ణయించారు. పులులతో పాటు ఇతర వన్యప్రాణుల సంరక్షణ, మానవ జోక్యం, అడవుల్లో జరుగుతున్న కార్యకలాపాలు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర అధ్యయనం చేపట్టేందుకు ఈ హైపవర్డ్ కమిటీని ఏర్పాటు చేశారు.

రాష్ట్ర అటవీశాఖ సలహాదారు పి. మల్లికార్జునరావు, అడిషనల్ పీసీసీఎఫ్ రాహుల్ పాండే కమిటీలో శాఖాపరమైన సభ్యులుగా వ్యవహరించనున్నారు. అలాగే వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) సభ్యుడు బి. రాజశేఖర్, హైదరాబాద్ కన్జర్వేషన్ ఫర్ టైగర్ సొసైటీ ప్రతినిధి ఇమ్రాన్ సిద్ధిఖీ, ప్రముఖ వన్యప్రాణి శాస్త్రవేత్త డాక్టర్ ఎం. నవీన్ కుమార్ సభ్యులుగా సేవలందించనున్నారు. కమిటీకి క్షేత్రస్థాయిలో సహకారం అందించడంతో పాటు సమన్వయ బాధ్యతలను విధుల్లో ఉన్న సీసీఎఫ్ అధికారి నిర్వహించనున్నారు.

పులుల జనాభా, వాటి ఆవాసాలకు ఎదురవుతున్న ముప్పులను గుర్తిస్తూ సమగ్ర అంచనా నివేదిక రూపొందించి, నివారణకు తగిన వ్యూహాలను రూపొందించాలని కమిటీ సభ్యులకు పవన్ కళ్యాణ్ సూచించారు. ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలు, సంస్థాగత సంస్కరణలు, సిబ్బంది సామర్థ్యాల పెంపు, మౌలిక సదుపాయాల బలోపేతం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై సమగ్ర సిఫారసులు రూపొందించాలని ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికారులు, ఇతర భాగస్వామ్య వర్గాలతో సమావేశాలు నిర్వహించి, శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను పరిశీలించి వీలైనంత త్వరగా ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. పులుల సంరక్షణ, అడవుల పరిరక్షణ, జీవవైవిధ్య రక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. హైపవర్డ్ కమిటీ సిఫారసులు నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్‌లో అమలవుతున్న సంరక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అవయవ మార్పిడి ఇక చేరువలో

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి మాట్లాడారు. జీవన్మృతులు అవయవాలను దానం చేస్తే ఎనిమిది మందికి కొత్త జీవితం అందించవచ్చని చెప్పారు. అవయవదానంపై ప్రతి కుటుంబంలో చర్చ జరగాలని, ముందుగానే తమ నిర్ణయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయాలని సూచించారు. రాష్ట్రంలో ఆదివారం నాటికి 5,935 మంది వివిధ అవయవాల కోసం నిరీక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. అవసరమైన అవయవాలు కోసం నెలలు, సంవత్సరాల పాటు ఎదురుచూస్తున్న రోగులకు సాధ్యమైనంత వరకు ప్రభుత్వ వైద్య వ్యవస్థ ద్వారానే శాశ్వత పరిష్కారం చూపాలన్నదే ఈ విధానం లక్ష్యమన్నారు.

**ప్రైవేట్ వైద్యానికే పరిమితం కాకుండా... :** '2025లో రాష్ట్రంలో జరిగిన 5 అవయవ మార్పిడి శస్త్రచికిత్సల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగినవి కేవలం 31 మాత్రమే' అని మంత్రి పేర్కొన్నారు. అధిక వ్యయం కారణంగా పేదలు చికిత్సకు దూరంగా ఉండకుండా ఉండేందుకు దశల వారీగా ప్రభుత్వ రంగంలో అవయవ మార్పిడి సామర్థ్యాన్ని పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. 12 బోధన ఆసుపత్రుల్లో అవయవ సేకరణ కేంద్రాలను త్వరగా ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. 'మొదటి దశలో విశాఖ, పలాస, కర్నూలు, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కాకినాడ బోధనా స్పత్రుల్లో మూత్రపిండాల మార్పిడి సేవలను విస్తరిస్తాశీ. 2028 నాటికి కాలేయ మార్పిడి, 2030 నాటికి విశాఖ, విజయవాడ, కర్నూలులో గుండె మార్పిడి సేవలను ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నాం. కూటమి ప్రభుత్వం ఏర్పడే సమయానికి రాష్ట్రంలో కేవలం మూడు అవయవ మార్పిడి కేంద్రాలు మాత్రమే ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య తొమ్మిదికి పెరిగింది. ఇప్పుడు ప్రత్యేక విధానం ద్వారా 12 ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో పూర్తి స్థాయి సేవలు



అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా పనిచేస్తున్నాం" అని వివరించారు. అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సలకు తగ్గట్లు చేపట్టాల్సిన వైద్యుల నియామకాలు, పరికరాలు, మౌలిక సదుపాయాల కల్పన కు చర్యలు తీసుకోవడం పైన దృష్టి పెడతామన్నారు.

**దాత కుటుంబాలకు మరింత భరోసా :** అవయవదానం చేసిన వారి కుటుంబాలకు ప్రస్తుతం అంత్యక్రియల కోసం రూ. 10 వేల సాయం అందిస్తున్నామని తెలిపారు. దీనిని రూ.లక్షకు పెంచే విషయం గురిశీచి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు ఇదే సమయంలో అర్హులైన దాత కుటుంబ సభ్యులకు ఒప్పంద లేదా పొరుగు సేవల కింద ఉద్యోగం, ఆర్థిక పరిస్థితిని బట్టి పింఛన్ కల్పించే విషయమై ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందాయని చెప్పారు.

**పెరుగుతున్న అవయవదానం :** రాష్ట్రంలో అవయవదానం క్రమంగా పెరుగుతోందని మంత్రి తెలిపారు. 2022లో 26 మంది, 2023లో 41 మంది, 2024లో 66 మంది, 2025లో 93 మంది దాతలు ముందుకొచ్చారని, 2026లో ఇప్పటివరకు 57 మంది దాతల ద్వారా 180 అవయవాలు సేకరించినట్లు వెల్లడించారు. అయినప్పటికీ అవసరాలతో పోలిస్తే ఇది చాలా తక్కువేనన్నారు.

అవయవదానంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచేందుకు ప్రముఖ క్రీడాకారిణి పీవీ సింధు వంటి ప్రముఖులు ముందుకు రావడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. సినీ, క్రీడా ప్రముఖులు, సామాజిక మాధ్యమాల్లో ప్రభావం కలిగినవారంతా ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు.

**ఆ కుటుంబాల ధైర్యం ముందు మా విజయాలు చిన్నవే...**

**పీవీ సింధు :** అవయవదానం ద్వారా మరొకరి జీవితంలో వెలుగు నింపుతున్న దాతల కుటుంబాలే నిజమైన విజేతలని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు అన్నారు. తాను ఎన్నో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించినప్పటికీ, కుటుంబ సభ్యుడిని కోల్పోయిన బాధలోనూ అవయవదానానికి అంగీకరించడం అన్నింటికంటే గొప్ప విషయమని పేర్కొన్నారు. అలాంటి కుటుంబాల ధైర్యం ముందు క్రీడల్లో తాను సాధించిన విజయాలు కూడా చిన్నవిగానే అనిపిస్తాయని చెప్పారు. జీవన్‌దాన్ అవయవదాతల కుటుంబ సభ్యులు తమ అనుభవాలను వివరిస్తుండగా ఎంతో భావోద్వేగానికి గురయ్యానని చెప్పారు.

"నేను ఎన్నో కఠినమైన పోటీలు ఆడాను. చివరి క్షణం వం-కూ విజయం కోసం పోరాడాను. అయితే అవన్నీ క్రీడలు మాత్రమే. నిజమైన జీవన పోరాటం ప్రతి రోజూ ఆసుపత్రుల్లో, అత్యవసర చికిత్స విభాగాల్లో జరుగుతోంది. మన రాష్ట్రంలో ఎంతోమంది ప్రాణాలను కాపాడే అవయవం కోసం జీవన్‌దాన్ జాబితాలో ఎదురుచూస్తున్నారు. వారు కాలంతో పోరాడుతూ ఒక అద్భుతం జరుగుతుందనే ఆశతో జీవిస్తున్నారు" అని సింధు పేర్కొన్నారు.

పేరు, ప్రతిష్ఠ, విజయాల కంటే మరొకరిలో కొనసాగుతున్న గుండెచప్పుడు గొప్ప వారసత్వమని పీవీ సింధు అభిప్రాయపడ్డారు.

ఒక్క అవయవదాత ఎనిమిది మంది వరకు ప్రాణాలను కాపాడగలరని ఆమె తెలిపారు. అవయవదానం మరణానికి సంబంధించిన అంశం కాదని, అది జీవితానికి ఇచ్చే అత్యున్నత గౌరవమని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవన్‌దాన్ కార్యక్రమం ద్వారా అవయవదానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, అవయవాల సేకరణ, కేటాయింపు, మార్పిడి ప్రక్రియను సమర్థంగా నిర్వహిస్తోందని పీవీ సింధు ప్రశంసించారు.

రాష్ట్రంలోని యువతతో పాటు ప్రతి ఒక్కరూ జీవన్‌దాన్ పోర్టల్‌లో తమ పేరును నమోదు చేసుకొని, అవయవదాన ప్రతిజ్ఞ చేయాలని కోరారు. "మన తర్వాత కూడా మరొకరికి జీవితం అందించే అవకాశం మన చేతుల్లోనే ఉంది. మనం జీవితాన్ని బహుమతిగా అందిద్దాం" అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జీవన్ దాన్ తరఫున అవయవాల దానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్య పర్యవేక్షకులు డాక్టర్ మన్మథరావు తెలిపారు. ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంట్ గ్రీఫ్ కౌన్సిలర్ మంగాదేవి ఇతరులు మాట్లాడిన వారిలో ఉన్నారు.

**భావోద్వేగ ప్రసంగాలతో నిశ్శబ్దం.. నిశ్శబ్దం :** అవయవాలను దానం చేసిన వారి కుటుంబ సభ్యుల భావోద్వేగ ప్రసంగాలతో ఏయూ కన్వెన్షన్ సెంటర్ లో ఒక్కసారిగా నిశబ్ద వాతావరణం నెలకొంది. తాము కోల్పోయిన వారి అవయవాలతో మరొకరి ప్రాణాలు నిలబడటం దుఃఖంలో ఉన్న తమకు కాస్తశీతా ఉపశమనం లభిస్తుందని పలువురు దాతలు కుటుంబ సభ్యులు చేసిన ప్రసంగాలు సభికుల హృదయాలను తాకాయి. ఈ కుటుంబం ఔదార్యాన్ని, ధైర్యాన్ని మంత్రి సత్యకుమార్ అభినందించారు. సముచిత రీతిన వారి సత్కరించారు.

## ఆర్టీసీ ఉద్యోగుల వినతిపత్రాలు నేడు కలెక్టర్ల ద్వారా సీఎంకు

- **42 వేల మంది ఉద్యోగుల సంతకాలతో సమస్యల పరిష్కారానికి జేఏసీ విజ్ఞప్తి**

విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్): ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా 42 వేల మంది ఉద్యోగుల సంతకాలతో కూడిన వినతిపత్రాలను సోమవారం (ఆగస్టు 3) జిల్లా కలెక్టర్ల ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి పంపించనున్నట్లు ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రకటించింది.

జేఏసీ కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు, కో-కన్వీనర్లు పి.వి. రమణారెడ్డి, జి.వి. నరసయ్య, సి.హెచ్. సుందరయ్య, కట్టా సుబ్రమణ్యం, ఎస్.వి. శేషగిరిరావు, కె. సూర్యప్రకాశరావు, డి. మాల్యాద్రి సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయం తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించడంతో పాటు, ప్రైవేటు సంస్థలకు విద్యుత్ బస్సులు కేటాయించడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోవాలని, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు.

## ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం సంపూర్ణ అండ

- **మోదీ ప్రభుత్వ నిధులు, జాతీయ ప్రాజెక్టులతో రాష్ట్ర ప్రగతికి బలమైన పునాది**
- **బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ**



విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ భారీ స్థాయిలో ఆర్థిక సహాయం, జాతీయ ప్రాజెక్టులు, మౌలిక వసతుల కల్పనకు విశేష కృషి చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ అన్నారు.

ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర విభజన అనంతరం పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తూ పనులు వేగవంతం చేసిందన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి కూడా కేంద్రం ఆర్థిక సహకారం అందించడంతో పాటు అవసరమైన మద్దతు ప్రకటించిందని తెలిపారు.

రహదారులు, రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాలు, పారిశ్రామిక కారిడార్లు, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి తదితర రంగాల్లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జాతీయ రహదారుల విస్తరణ, రైల్వే ప్రాజెక్టుల వేగవంతం, విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కేంద్ర సహకారం వంటి చర్యలు రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

2024-25 కేంద్ర బడ్జెట్‌లో అమరావతి అభివృద్ధికి ప్రత్యేక ఆర్థిక సహాయం ప్రకటించడంతో పాటు పోలవరం ప్రాజెక్టుకు పూర్తి మద్దతు కొనసాగించిందన్నారు. అలాగే 2025--26లో రైల్వే ప్రాజెక్టులకు సుమారు రూ. 10 వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు రూ. 3,300 కోట్ల కేటాయింపు రాష్ట్రాభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర పన్నుల వాటా, కేంద్ర ప్రాయోజిత పథకాలు, గ్రామీణాభివృద్ధి, తాగునీటి పథకాలు, గృహనిర్మాణం, ఆరోగ్యం, విద్య, ఉపాధి హామీ తదితర రంగాలకు ప్రతి ఏడాది వేల కోట్ల రూపాయల నిధులు అందుతున్నాయని చెప్పారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, జల్ జీవన్ మిషన్, ఆయుష్మాన్ భారత్, ఉజ్వల యోజన, స్వచ్ఛ భారత్ మిషన్, పీఎం గ్రామ్ సడక్ యోజన వంటి కేంద్ర పథకాల ద్వారా రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలు ప్రత్యక్షంగా లబ్ధి పొందుతున్నాయని వివరించారు.

పీఎం గతిశక్తి, మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, డిజిటల్ ఇండియా వంటి జాతీయ కార్యక్రమాల ద్వారా పెట్టుబడులు పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు విస్తరిస్తున్నాయని పేర్కొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిని రాజకీయ కోణంలో కాకుండా జాతీయ అభివృద్ధి దృక్పథంతో చూడాలని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ప్రజలకు వాస్తవాల ఆధారంగా వివరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని షేక్ బాజీ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సంపూర్ణ సహకారం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## ఆగస్టు 5న సీజేపీ కీలక సమావేశం.. భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం..



ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : నీట్ ప్రశ్నపత్రం లీక్ అంశంపై ఆందోళనలతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సీజేపీ సంస్థ ఆగస్టు 5న కీలక సమావేశాన్ని నిర్వహించనుంది. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో వ్యవస్థాపకుడు అభిజిత్ నివాసంలో కోర్ కమిటీ సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించనుంది

గత నెల రోజులుగా చేపట్టిన ఉద్యమంపై సమీక్షతో పాటు, ఇకపై అనుసరించాల్సిన వ్యూహంపై నిర్ణయాలను కూడా ఈ సమావేశంలో తీసుకోనున్నారు. రాష్ట్రాల వారీగా విద్యార్థులు, వాలంటీర్లు, కార్యకర్తల నుంచి సేకరించిన అభిప్రాయాలు, సూచనలను కూడా కోర్ కమిటీ చర్చించనుంది. అనంతరం మీడియా సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను అధికారికంగా ప్రకటించనున్నట్టు సమాచారం. తదుపరి దశలో చేపట్టే ఉద్యమాలు, కార్యక్రమాలపై కూడా స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది.

విద్యార్థి నిరసనల అంశంపై స్పందిస్తూ పిల్లలను క్షమిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. అయితే క్షమాపణలతో సరిపెట్టకుండా విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ డిమాండ్ చేశారు. అలాగే జులై 20న జరిగిన పోలీసు చర్యపై ప్రభుత్వం అధికారికంగా క్షమాపణ చెప్పాలని ఆయన కోరారు. ఏదేమైనా ఆగస్టు 5 సమావేశం అనంతరం సీజేపీ ఉద్యమం ఏ దిశగా సాగనుందనే విషయంపై స్పష్టత వచ్చే అవకాశముంది.

# యువ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ అండ

- **పెట్టుబడులు, స్టార్టప్‌లకు ప్రోత్సాహం**
- **పర్యాటక రంగంలోనూ పూర్తి సహకారం అందిస్తామని మంత్రి కందుల దుర్గేష్ హామీ**

రాజమహేంద్రవరం(జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో వ్యాపార అభివృద్ధికి, ఆర్థిక ప్రగతికి అత్యంత అనుకూల వాతావరణం ఉందని, నూతనంగా వ్యాపార రంగంలోకి వచ్చే యువతను, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని మనీష్ ఫంక్షన్ హాల్ లో 'సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్' ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్లోబల్ బిజినెస్ మీట్ - సమాఖ్య 2026'సన్నాహక సమావేశానికి మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేదంలా ఘోషించే గోదావరి తీరాన జరిగిన ఈ కార్యక్రమంలో.. రాబోయే అక్టోబర్ 13 నుండి 15 వరకు హైదరాబాద్ లో నిర్వహించనున్న 'గ్లోబల్ బిజినెస్ మీట్' కు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి దుర్గేష్ ఇతర అతిథులతో కలిసి ఆవిష్కరించారు. 'గ్లోబల్ బిజినెస్ మీట్ - 2026' పారిశ్రామిక చిత్రాన్ని మార్చబోతోందని, ఈ అవకాశాన్ని



స్థానిక యువత, వ్యాపారవేత్తలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు..యువత వ్యాపారవేత్తలుగా ఆర్థికంగా పరిపుష్టి సాధించినప్పుడే భవిష్యత్తులో రాజకీయ నాయకత్వం వహించే స్థాయికి ఎదుగుతారని మంత్రి దుర్గేష్ అన్నారు. యువత కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా నలుగురికి ఉపాధి కల్పించే ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ వైపు దృష్టి సారించాలని సూచించారు. పదుల సంఖ్యలో యువతను ప్రోత్సహించేందుకు ముందుకొచ్చిన 'సమాఖ్య' ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రయత్నాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఇది ఒక సువర్ణ అవకాశం.. ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పర్యాటక రంగంలో కొత్తగా పెట్టుబడులు పెట్టే వారికి కూటమి ప్రభుత్వం నూతన పర్యాటక పాలసీ 2024-29 ద్వారా ఇప్పటికే పలు ఆర్థిక, వ్యాపార ప్రోత్సాహకాలను అందిస్తోందని స్పష్టం చేశారు. మంచి నెట్‌వర్త్, బ్రాండ్ కంపెనీలతో టైఅప్ అయి వచ్చే రిసార్ట్స్, హోటల్స్ , అమ్యూజ్‌మెంట్ పార్క్స్, అడ్వెంచర్ టూరిజం ప్రాజెక్టులకు సంబంధించిన ఇన్వెస్టర్లకు పర్యాటక శాఖ తరఫున పూర్తి అండగా ఉంటామని భరోసానిచ్చారు. పెట్టుబడిదారుల కోసం 'ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీ' ద్వారా భూములు కేటాయిస్తున్నామని, ఎక్కడెక్కడ ల్యాండ్ అందుబాటులో ఉందో ఆ వివరాలను పర్యాటక శాఖ వెబ్‌సైట్‌లో పారదర్శకంగా అందుబాటులో ఉంచామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ లు రాష్ట్రాన్ని వేగవంతంగా అభివృద్ధి చేయాలనే తలంపుతో ఉన్నారని తెలుపుతూ..ఎంఎస్ఎంఈ, స్టార్టప్‌లు, మెగా లేదా అల్ట్రా మెగా ప్రాజెక్టులు ఏదైనా సరే.. ఆలోచనను ఆచరణలో పెడితే విజయం సాధించవచ్చన్నారు. ఈ సందర్భంగా పర్యాటక రంగంలో మంత్రి దుర్గేష్ పెట్టుబడులు ఆహ్వానిస్తూ ముందుకు వచ్చేవారికి కూటమి ప్రభుత్వ పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి సాంకేతిక విప్లవాన్ని యువత వినియోగించుకోవాలని సూచించారు. టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్‌ను అందిపుచ్చుకోవడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందంజలో ఉందని గుర్తుచేశారు."మన గోదావరి జిల్లాల యువత పారిశ్రామిక, సాంకేతిక రంగాలలోకి అడుగుపెట్టాలి. మీ ఆలోచనలకు ఊపిరిపోసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఏకాగ్రత, పట్టుదల, శ్రమించే తత్వం ఉన్న యువత, యువ పారిశ్రామికవేత్తలు నిరంతరం తమ ఆలోచనలను పంచుకోవడానికి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పర్యాటక మంత్రిగా నేను ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం" అని మంత్రి దుర్గేష్ భరోసానిచ్చారు. వ్యవసాయ, ఆక్వా, సెరి, హార్టికల్చర్ రంగాల్లో ఇప్పటికే మంచి వృద్ధి సాధించిన తూర్పుగోదావరి జిల్లాను పారిశ్రామికంగా మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని మంత్రి కందుల దుర్గేష్ అభిప్రాయపడ్డారు.

# ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్

- **టీడీపీ కార్యకర్తలపై దాడి కేసులో 15 మందికి 14 రోజుల రిమాండ్**

కర్నూలు (జర్నలిస్ట్ ఫైల్) : టీడీపీ కార్యకర్తలపై దాడి, దౌర్జన్యాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై కర్నూలు జిల్లా ఆలూరు వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే విరూపాక్షిని చిప్పగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన కుమారుడు చంద్రశేఖర్ సహా మొత్తం 15 మందిని అరెస్ట్ చేసి ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం కోర్టు వారందరికీ 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

పోలీసుల వివరాల ప్రకారం, శనివారం రాత్రి చిప్పగిరి మండలంలోని సంగాల, నేమకల్లు గ్రామాల్లో వైఎస్సార్సీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య ఫోన్ సంభాషణకు సంబంధించిన వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే విరూపాక్షి తన అనుచరులతో కలిసి టీడీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు



వచ్చాయి.

ముందుగా సంగాల గ్రామంలో దాడులు జరిగిన అనంతరం నేమకల్లు గ్రామానికి వెళ్లిన నిందితులు టీడీపీ కార్యకర్తల ఇళ్లపై దాడి చేసి ఇంట్లోని సామగ్రి, టీవీలను ధ్వంసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సుచిత్ర అనే మహిళపై దాడి చేసి ఆమె భర్తను గాయపరిచినట్లు, చిప్పగిరి మండల టీడీపీ కన్వీనర్ పురుషోత్తం బొలెరో వాహనాన్ని కూడా ధ్వంసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలో నలుగురు టీడీపీ కార్యకర్తలు గాయపడగా, వారిని ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

టీడీపీ కార్యకర్త శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిప్పగిరి పోలీసులు ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టంతో పాటు ఇతర సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆదివారం తెల్లవారుజామున ఎమ్మెల్యే నివాసానికి చేరుకున్న పోలీసులు విరూపాక్షిని అదుపులోకి తీసుకుని, ఆయన కుమారుడు చంద్రశేఖర్‌తో పాటు మరో 14 మందిని అరెస్ట్ చేశారు.

ఈ విషయం తెలిసి వైఎస్సార్సీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చిప్పగిరి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని నిరసన వ్యక్తం చేయడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం అరెస్టు చేసిన వారిని కోర్టులో హాజరుపరచగా, కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఎమ్మెల్యే విరూపాక్షితో పాటు మిగిలిన నిందితులను జైలుకు తరలించారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్, మైదుకూరులో స్పాట్ అడ్మిషన్లు - ఆగస్టు 5న నిర్వహణ

మైదుకూరు(జర్నలిస్ట్ ఫైల్ ): ప్రభుత్వ పాలిటెక్నిక్ మైదుకూరులో 2026--27 విద్యా సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్లు 05-08-2026 (బుధవారం) నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి. పార్థసారథి ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లకు అర్హులని పేర్కొన్నారు. కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ , సివిల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్ & ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెటలర్జికల్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులలో సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్, మైదుకూరులో అత్యున్నత అర్హతలు కలిగిన అధ్యాపకుల చేత ఉన్నత ప్రమాణాలు కలిగిన సాంకేతిక విద్యను విద్యార్థులకు అందిస్తామని వివరించారు. ముఖ్యంగా కెమికల్ ఇంజనీరింగ్ కోర్సు, మెటలర్జికల్ ఇంజనీరింగ్ మరియు కంప్యూటర్ ఇంజనీరింగ్ & ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ కోర్సులు రాష్ట్రంలోని కొద్ది ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో మాత్రమే అందుబాటులో ఉండటం విశేషమని పేర్కొన్నారు.

AP POLYCET-2026లో అర్హత పొందిన OC/BC విద్యార్థులకు మొత్తం ప్రవేశ రుసుము రూ. 5,400/-, AP POLYCET-2026లో అర్హత పొందని లేదా పాలిసెట్ రాయని OC/BC విద్యార్థులకు రూ. 5,800/-, AP POLYCET-2026లో అర్హత పొందిన SC/ST విద్యార్థులకు రూ. 4,950/- మరియు AP POLYCET-2026లో అర్హత పొందని లేదా పాలిసెట్ రాయని SC/ST విద్యార్థులకు రూ. 5,050/- మాత్రమే అని తెలిపారు.

స్పాట్ అడ్మిషన్‌కు హాజరయ్యే విద్యార్థులు ఒరిజినల్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ , SSC మార్కుల మెమో, 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, SC/ST/BC విద్యార్థులు కుల ధ్రువీకరణ పత్రం, అలాగే AP POLYCET-2026లో అర్హత పొందిన వారు అయితే హాల్ టికెట్ మరియు ర్యాంక్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

అర్హులైన విద్యార్థులు 05-08-2026 ఉదయం ప్రభుత్వ పాలిటెక్నిక్, మైదుకూరులో జరిగే స్పాట్ అడ్మిషన్లకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ జి. పార్థసారథి గారు కోరారు. మరిన్ని వివరాలకు: ప్రిన్సిపాల్, ప్రభుత్వ పాలిటెక్నిక్, మైదుకూరును 7075922670 లేదా 8985257287 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.


## విద్యుత్ సరఫరాకు అంతరాయం

తెనాలి (జర్నలిస్ట్ ఫైల్ ):మండల గ్రామీణ నందివెలుగు 11KV లైన్లకు, అడ్డుగా ఉన్న చెట్టుకొమ్మలు తొలగించుటకు, మరమ్మతులు జరుగుతున్న కారణంగా నందికి వేరు నందివెలుగు గ్రామంలోని 33/11KV సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామం నుండి ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించవలసినది విద్యుత్తు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి విశ్వనాథం కోరారు.

# అరుణాచలం.. రూల్స్, టైమింగ్స్ లో మార్పులు

అరుణాచలం (జర్నలిస్ట్ ఫైల్) : అరుణాచలంలోని గిరివలయం మార్గంలో ఉన్న మోక్షమార్గం (ఇడుక్కు పిళ్లయ్యార్ గుహ) వద్ద ఇటీవల జరిగిన విషాద ఘటన నేపథ్యంలో ఆలయ యంత్రాంగం కీలక నిర్ణయాలు తీసుకుంది. కొద్ది రోజుల క్రితం ఏపీకి చెందిన ఓ భక్తుడు ఇరుకైన రాతి మార్గంలో చిక్కుకుని ఊపిరాడక మృతిచెందడంతో భద్రతా చర్యలను మరింత కఠినతరం చేశారు. ఈ కొత్త నిబంధనల ప్రకారం, మోక్షమార్గంలో ప్రవేశాన్ని నిర్దిష్ట సమయాలకు మాత్రమే పరిమితం చేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, అలాగే సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతిస్తున్నారు. రద్దీని నియంత్రించేందుకు ఒకేసారి పరిమిత సంఖ్యలోనే భక్తులను లోపలికి పంపుతున్నారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, శారీరక ఇబ్బందులు ఉన్నవారు, అధిక బరువు ఉన్నవారు ఈ ఇరుకైన మార్గంలో వెళ్లవద్దని అధికారులు సూచిస్తున్నారు.

అలాగే లోపల ఎక్కువసేపు ఆగడం, ఫొటోలు లేదా వీడియోలు తీయడం, తోపులాటకు పాల్పడడం నిషేధించారు. భక్తులు సిబ్బంది సూచనలు తప్పనిసరిగా పాటించాలని ఆలయ యంత్రాంగం స్పష్టం చేసింది. మోక్షమార్గంలోకి వెళ్లే ముందు భక్తులు తమ ఆరోగ్య పరిస్థితిని అంచనా



వేసుకోవాలని, శ్వాస సంబంధిత సమస్యలు ఉన్నవారు ఈ మార్గాన్ని ఉపయోగించకపోవడమే మంచిదని అధికారులు సూచిస్తున్నారు. భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యంగా ఈ కొత్త టైమింగ్స్, నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చినట్లు ఆలయ యంత్రాంగం తెలిపింది.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం స్పందించాలి

- **పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలి**
- **పెండింగ్ డీఏలు వెంటనే మంజూరు చేయాలి**
- **ముఖ్యమంత్రితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి రోడ్‌మ్యాప్ ప్రకటించాలి : ఏపీ జేఏసీ**

విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తక్షణమే చొరవ చూపాలని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని ఏపీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్, సెక్రటరీ జనరల్ కె.ఎస్.ఎస్. ప్రసాద్ కోరారు.

విజయవాడలోని ఏపీ ఎన్జీవో హోంలో శనివారం ఎ. విద్యాసాగర్ అధ్యక్షతన నిర్వహించిన ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం నాయకులు మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగుల ప్రధాన డిమాండ్లను వివరించారు.

ఎ. విద్యాసాగర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వేతన సవరణ జరిగి ఇప్పటికే ఎనిమిదేళ్లు దాటిపోయిందని, గత ప్రభుత్వం నియమించిన పీఆర్సీ కమిషన్ రాజీనామా చేసి రెండేళ్లకు పైగా గడిచినా ప్రస్తుత ప్రభుత్వం కొత్త పీఆర్సీ కమిషన్‌ను నియమించకపోవడం ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిషన్‌ను నియమించి మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని డిమాండ్ చేశారు.

గత ఏడాది కాలంగా ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని, ఉద్యోగుల కొనుగోలు శక్తి తగ్గిపోతోందన్నారు. ప్రస్తుతం ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.




ఉద్యోగులకు ఉపశమనం కల్పించేందుకు పెండింగ్ డీఏలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

గత ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేసిందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బకాయిల చెల్లింపులు, ప్రతి నెల ఒకటో తేదీన జీతాల చెల్లింపు వంటి అంశాల్లో సానుకూల చర్యలు తీసుకున్నప్పటికీ, ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాల అమలులో జాప్యం కొనసాగుతోందని అన్నారు. దీంతో ఉద్యోగ వర్గాల్లో అసంతృప్తి నెలకొందని తెలిపారు.

ఉద్యోగుల సమస్యలపై ఏపీ జేఏసీ ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లిందని, రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించే కార్యక్రమాన్ని కూడా నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి మంత్రుల కమిటీతో సమావేశం ఏర్పాటు చేయడం స్వాగతించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. ఆ సమావేశంలో సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయని, ముఖ్యమంత్రితో చర్చించిన అనంతరం మరో సమావేశంలో నిర్ణయాలు ప్రకటిస్తామని మంత్రుల కమిటీ తెలిపిందన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాల నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

పొరుగు రాష్ట్రం తెలంగాణలో మూడు సంవత్సరాల క్రితమే వేతన సవరణ ప్రక్రియ ప్రారంభమై, పీఆర్సీ కమిటీ నియామకంతో పాటు మధ్యంతర భృతి కూడా ప్రకటించారని గుర్తు చేశారు. ప్రస్తుతం అక్కడ పీఆర్సీ ప్రక్రియ తుది దశకు చేరుకోగా, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 12వ పీఆర్సీ కమిషన్ నియామకం, ఐఆర్ ప్రకటన వంటి కీలక అంశాల్లో ఇప్పటికీ ఎలాంటి పురోగతి కనిపించకపోవడం ఉద్యోగుల్లో తీవ్ర నిరాశకు దారితీస్తోందన్నారు. ప్రభుత్వం ఇకపై జాప్యం చేయకుండా పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలని కోరారు.

జేఏసీ సెక్రటరీ జనరల్ కె.ఎస్.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జేఏసీ చేపట్టిన ఉద్యమాల ఫలితంగానే మంత్రివర్గ ఉపసంఘం ఉద్యోగ సంఘాలతో సమావేశమైందన్నారు. ఆ సమావేశంలో ఉద్యోగుల డిమాండ్లపై సానుకూల స్పందన లభించిందని, త్వరలో ముఖ్యమంత్రితో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రులు హామీ ఇచ్చారని తెలిపారు.

ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణ ప్రభావం నుంచి ఉద్యోగులను రక్షించేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి డీఏ ప్రకటించే విధానం రాజ్యాంగబద్ధమైన కాంపెన్సేటరీ వ్యవస్థలో భాగమని ఆయన పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కొనుగోలు శక్తి తగ్గిపోకుండా జీవన వ్యయ సూచీ ఆధారంగా డీఏలు ప్రకటించడం దశాబ్దాలుగా అమలులో ఉన్న విధానమని గుర్తు చేశారు. ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాకపోతే రాష్ట్ర స్థాయి జేఏసీ కార్యవర్గ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని హెచ్చరించారు.

సమావేశంలో డి.వి. రమణ (ఏపీ ఎన్జీవోస్), డి. వెంకటేశ్వర్లు (పెన్షనర్స్), ఎల్. సాయి శ్రీనివాస్ (ఎస్టీయూ), జి. హృదయరాజు (ఏపీటీఎఫ్), ఎ. సాంబశివరావు (పబ్లిక్ సెక్టార్), సి.హెచ్. మంజుల (ఏపీటీఎఫ్), ఎం. కృష్ణయ్య (పీఆర్‌టీయూ), కె. శ్రీనివాసరాజు (పీపీటీడీ మజ్దూర్ యూనియన్), ఎన్. చంద్రశేఖర్ (క్లాస్-4 ఉద్యోగులు), పి.వి. సాయికుమార్ (వ్యవసాయ శాఖ), ఆర్. మధుకర్‌బాబు (రవాణా శాఖ), జి. వెంకటరెడ్డి (పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్లు), పాము శ్రీనివాసరావు (ట్రెజరీ సర్వీసెస్), ఎస్. రాధమ్మ (ప్రభుత్వ నర్సులు), పి. రమేష్ (ఇరిగేషన్ ఎన్జీవోస్), వై.వి.డి. ప్రసాద్ (పంచాయతీ కార్యదర్శులు), ఆర్.ఎస్. హరనాథ్ (పే అండ్ అకౌంట్స్), బి. నరసింహులు (ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్), బి. వెంకటేష్‌బాబు (కమర్షియల్ టాక్సెస్), ఎస్.ఎల్. సోమయాజులు (టెక్నికల్ ఆఫీసర్స్), టి. కృష్ణకిషోర్ (ఐటీఐ అండ్ డీఎల్టీసీ స్టాఫ్ అసోసియేషన్), వి. రవి (జూనియర్ లెక్చరర్స్), జానీ పాషా షేక్ (గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు), సి. మారియా దాసు (ఏపీసీపీఎస్ఈఏ), కె. ప్రకాశ్‌రావు (ప్రాథమిక ఉపాధ్యాయులు), ఎస్‌కే. సుభాని (వ్యవసాయ విస్తరణ అధికారులు), సయ్యద్ వాజిద్ రేహాన్ (ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్), పి. క్రాంతికుమారి (మహిళా, శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులు), జి. రామకృష్ణ (నాన్-గ్రాడ్యుయేట్ వెటర్నరీనరియన్స్ ఫెడరేషన్) తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారం..

– తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన వారోత్సవాలు
– అంగన్వాడి చిన్నారులకు దుస్తుల పంపిణీ



**ఆత్మకూరు (ఎం), ఆగస్టు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. నవజాత శిశువుకు జన్మించిన గంటలోపే తల్లిపాలు ఇవ్వడం అత్యంత ముఖ్యమని చెప్పారు. తొలి ఆరు నెలల వరకు తల్లిపాలే శిశువుకు సంపూర్ణ పోషకాహారమని, ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అవి ఎంతో దోహదపడతాయని తెలిపారు. అనంతరం ప్రభుత్వం అందించిన దుస్తులను అంగన్వాడీ చిన్నారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్, వార్డు సభ్యురాలు తవిటి శైలజ, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, సిబ్బంది, చిన్నారులు, వారి తల్లులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే మదన్మోహన్ జన్మదిన వేడుకలు



**తాడ్వాయి, ఆగస్టు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ జన్మదిన వేడుకలు శనివారం మండలంలోని పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు,ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని బ్రహ్మాజీ వాడి, చందాపూర్, చిట్యాల్,దేవయపల్లి, తాడ్వాయి, తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ వాడి, చందా పూర్, తాడ్వాయి, ఎర్ర పహాడ్, గ్రామాలలో పాఠశాలను విద్యార్థిని విద్యార్థులకు నోట్ బుక్స్ పండ్లు పంపిణీ చేశారు. తాడ్వాయి పార్టీ కార్యాలయంలో నాయకుల కార్యకర్తలు, కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల అధికార అధ్యక్షుడు బండారి సంజీవ్ మాట్లాడుతూ తమ నాయకుడు మదన్మోహన్ ఎల్లారెడ్డి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాడని, ప్రజా సంక్షేమం కోసం పాటుపడే నాయకుడని, ఐ కమాండ్ తో ఆయనకు న్న మంచి పరిచయాలతో నియోజకవర్గానికి భారీగా నిధులు తెచ్చి, అభివృద్ధి చేస్తున్నాడన్నారు. తమ నాయకుడి పుట్టినరోజు వేడుకలను పాఠశాల విద్యార్థులతో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. తమ ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా పలువురు కార్యకర్తలు, గుడిలలో ప్రత్యేక పూజలు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికార ప్రతినిధి షావకత్ అలీ, యూత్ అధ్యక్షుడు, అఖిల్ రావు, తాడ్వాయి గ్రామ అధ్యక్షుడు రంజిత్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గైని శివాజీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు రాజలింగం, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఎరువుల దుకాణాల్లో ఈ-పీఓఎస్ పెండింగ్ నమోదులు వెంటనే పూర్తి చేయాలి

– రైతులు తప్పనిసరిగా రైతు నమోదు చేసుకోవాలి
– ఎల్‌నినో ప్రభావంతో తక్కువ నీటితో పండే పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి
– మండల వ్యవసాయ అధికారి ఋషేంద్రమని



**మిర్యాలగూడ, ఆగస్టు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** మిర్యాలగూడ మండల పరిధిలోని అన్ని ఎరువుల చిల్లర విక్రేతలు, టోకు వ్యాపారులు తమ వద్ద పెండింగ్‌లో ఉన్న ఈ-పీఓఎస్ స్టాక్ ధృవీకరణ నమోదులను వెంటనే పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారి యం. ఋషేంద్రమని సూచించారు. ఎరువుల స్టాక్‌ను స్వీకరించిన ప్రతిసారి ఈ-పీఓఎస్ యంత్రంలో స్టాక్ ధృవీకరణ నమోదును వెంటనే పూర్తి చేయడం తప్పనిసరి అని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లు లేకుండా వంద శాతం నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ విషయమై వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది మండలంలోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారని తెలిపారు. తనిఖీల సమయంలో పెండింగ్‌లో ఉన్న ఈ-పీఓఎస్ నమోదులు గుర్తించినట్లయితే సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందువల్ల మండలంలోని అన్ని చిల్లర విక్రేతలు, టోకు వ్యాపారులు తమ ఈ-పీఓఎస్ నమోదు వివరాలను వెంటనే పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న అన్ని స్టాక్ ధృవీకరణ నమోదులను పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా మండలంలోని ప్రతి రైతు రైతు నమోదు (ఫార్మర్స్ రిజిస్ట్రీ) తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. రైతు నమోదు చేయించుకోని వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సబ్సిడీలు అందకపోవడంతో పాటు ఎరువులు కూడా అందుబాటులో ఉండవని తెలిపారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం కొనసాగుతున్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి యం. ఋషేంద్రమని సూచించారు.

## సీతారామాంజనేయ స్వామి ఆలయంలో అన్న ప్రసాదం

– పాల్గొన్న భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి.
– సీతారామాంజనేయ సహిత సంతోషి మాతలనకు ప్రత్యేక పూజలు.



**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** భువనగిరి పట్టణ శ్రీ సీతారామాంజనేయ సహిత సంతోషిమాత ఆలయంలో ఆలయ చైర్మన్ చాగంటి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న దాన కార్యక్రమంలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆలయంలో శ్రీ సీతా రామాంజనేయ స్వామి వారిని, సంతోషిమాత అమ్మవారిని దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వ హించిన ఆలయ చైర్మన్‌ని, ఆలయ నిర్వా హకులను ఎమ్మెల్యే అభినందించారు. భక్తు లకు సేవ చేయడం గొప్ప పుణ్యకార్యమని, ఇటు వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతశ, మానవతా విలువలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ అవేస్ చిస్తీ, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కూర వెంకటేశ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## "ఆలేరు రెవెన్యూ డివిజన్‌పై రాజకీయం మానండి... ప్రజల కోసం కలిసి పోరాడండి"

- పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు నోరు మెదపని వారు..
- ఇప్పుడు ధర్నాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు
- రెవెన్యూ డివిజన్ సాధించే వరకు నా పోరాటం ఆగదు..
- ఆలేరు అభివృద్ధిపై ప్రతిపక్షాలకు ఓర్వలేకే విమర్శలు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ఆలేరు, ఆగస్టు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సానుకూలంగా ఉందని, ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ఆలేరు పట్టణంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ప్రతిపక్షాల విమర్శలకు ఘాటుగా సమాధానం ఇచ్చారు. ఆలేరు రెవెన్యూ డివిజన్ అంశంపై అఖిలపక్షాలు చేపట్టిన నిరసనలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ధర్నాలు, నిరసనలు చేయడం ప్రతి ఒక్కరి హక్కేనని, అయితే ప్రజల భావోద్వేగాలను రాజకీయాలకు వాడుకోవడం మాత్రం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు."పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఆలేరు ప్రజలు గుర్తుకు రాలేదు... రెవెన్యూ డివిజన్ గుర్తుకు రాలేదు... ఇప్పుడు అధికారం కోల్పోయాక ప్రజలపై ప్రేమ ఒక్కసారిగా ఎలా పొంగిపొర్లుతోంది? అధికారంలో ఉన్నప్పుడు చేయలేని పని, ఇప్పుడు ధర్నాలు చేసి సాధిస్తామంటూ ప్రజలను మభ్యపెట్టడం రాజకీయ అవకాశవాదం కాదా?" అంటూ ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.రాష్ట్రంలో గత ప్రభుత్వం 25 కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసినప్పటికీ ఆలేరును ఎందుకు విస్మరించిందని ప్రశ్నించారు. "ఆ రోజున అధికారంలో ఉండి ఒక్క ఫైల్ కూడా ముందుకు కదపని వారు... నేడు జెండాలు పట్టుకుని రోడ్లెక్కడం ప్రజలను మోసం చేయడానికే తప్ప అభివృద్ధిపై ప్రేమతో కాదు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఎవరు నిజంగా పనిచేశారు... ఎవరు కేవలం రాజకీయాలు చేస్తున్నారో ప్రజలకు బాగా తెలుసు" అని అన్నారు. ఆలేరు రెవెన్యూ డివిజన్ అంశాన్ని తాను ఇప్పటికే రెండుసార్లు అసెంబ్లీలో ప్రస్తావించానని, తిరుమలపూర్ బహిరంగ సభలో కూడా ఈ డిమాండ్‌ను ప్రజల ముందు ఉంచానని చెప్పారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో ప్రత్యేకంగా చర్చించి ఆలేరు రెవెన్యూ డివిజన్ అవసరాన్ని వివరించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలిస్తోందని, రెవెన్యూ డివిజన్ సాధించే వరకు తన పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు విమర్శలు చేయడం తప్ప అభివృద్ధిపై మాట్లాడే పరిస్థితిలో లేవని విమర్శించారు. "ఆలేరు అభివృద్ధి వేగాన్ని చూసి కొందరికి కంటిమీద కునుకు లేకుండా పోయింది. అందుకే ప్రతి అభివృద్ధి పనిలోనూ రాజకీయం వెతుకుతున్నారు. ప్రజలు ఇక మాటలు కాదు... పనులు చూసే స్థితికి వచ్చారు" అని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం మల్లాపూర్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామని ప్రకటించి మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. అయితే తమ ప్రభుత్వం 20 ఎకరాల స్థలంలో మెడికల్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించిందని చెప్పారు. ఆలేరు పట్టణంలో సుమారు 500 మంది అర్హులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామని, దాదాపు 200 మందికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఆలేరు మొదటి స్థానంలో నిలవడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గతంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అండర్‌పాస్ నిర్మాణాన్ని తమ ప్రభుత్వం ప్రారంభించి వేగంగా పూర్తి చేస్తోందని చెప్పారు. రూ.44 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించామని, ప్రతి మున్సిపాలిటీలో ఆధునిక కార్యాలయ భవనాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. బహదూర్‌పేట చెరువు అభివృద్ధికి రూ.2.50 కోట్లు ఖర్చు చేశామని, కొలనుపాక-కాల్వపల్లి వంతెన నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గత పదేళ్లలో వచ్చిన అభివృద్ధి నిధులతో పోలిస్తే కేవలం రెండున్నర సంవత్సరాల్లోనే సుమారు రూ.70 కోట్ల అభివృద్ధి నిధులను ఆలేరు నియోజకవర్గానికి తీసుకొచ్చామని, వచ్చే నెలలో మరో రూ.10 కోట్ల నిధులు మంజూరు కానున్నట్లు వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పారు. చివరగా ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేస్తూ, "ఆలేరు రెవెన్యూ డివిజన్ అనేది ఏ ఒక్క పార్టీది కాదు... ఇది ఆలేరు ప్రజల హక్కు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు సహకరించండి. ప్రజలను రెచ్చగొట్టే రాజకీయాలు, చౌకబారు విమర్శలు మానండి. అభివృద్ధి విషయంలో అందరం ఒక్కటిగా నిలిస్తే ఆలేరు మరింత వేగంగా ముందుకు సాగుతుంది. ఆలేరు అభివృద్ధే మా ధ్యేయం... రెవెన్యూ డివిజన్ సాధనే మా లక్ష్యం" అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు.

## ఎస్సీ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తా

- డీసీసీ ఎస్సీ విభాగం నూతన వైస్ ప్రెసిడెంట్ చెలిమెండ్ల వెంకటరత్నం
- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందజేత



**మిర్యాలగూడ, ఆగస్టు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఎస్సీ విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా మిర్యాలగూడ మండలం అవంతిపురం గ్రామానికి చెందిన చెలిమెండ్ల వెంకటరత్నంను నియమిస్తూ డీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ బోడస్వామి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి చేతుల మీదుగా చెలిమెండ్ల వెంకటరత్నం నియామక పత్రాన్ని అందుకున్నారు. పార్టీ పట్ల ఆయన చూపిన నిబద్ధత, సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ, పార్టీ సిద్ధాంతాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా చెలిమెండ్ల వెంకటరత్నం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లాస్థాయి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి, డీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ బోడస్వామికి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తూ, ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుండు నరేందర్ గౌడ్, అవంతిపురం గ్రామ సర్పంచ్ వల్దాస్ సుజాత-సురేష్, రాయిని పాలెం సర్పంచ్ మురళి, మొలకలకల్వ సర్పంచ్ జోష్ గౌడ్, గ్రామ కమిటీ నాయకుడు దాసరి కుమార్, చెలిమెండ్ల లక్ష్మయ్య, హరిబాబు, బంగారి మహేష్, కోటేష్, యడవల్లి అంజయ్య, అజయ్, శ్రీను, టాక్ సైదులు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేవరకొండ రోడ్డుపై మున్సిపల్ కొరడా.. 46 ఆక్రమణలు తొలగింపు

- కమిషనర్ బి.వంశీ కృష్ణ ఆదేశాలతో ప్రత్యేక డ్రైవ్
- డీఈఓ కార్యాలయం నుంచి దుప్పలపల్లి రోడ్డు వరకు చర్యలు
- 46 ఆక్రమణలు తొలగింపు.. 3 ప్రధాన జంక్షన్లు క్లియర్
- ఫుట్‌పాత్‌లు పాదచారుల కోసమే.. ఆక్రమిస్తే జరిమానాలు, చట్టపరమైన చర్యలు
- నగరవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెల్లడి



**నల్గొండ, ఆగస్టు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** నగరంలో ట్రాఫిక్‌ను సజావుగా నిర్వహించడం, పాదచారులకు సురక్షిత రాకపోకలు కల్పించడం లక్ష్యంగా మున్సిపల్ కమిషనర్ శ్రీ బి. వంశీ కృష్ణ ఆదేశాల మేరకు దేవరకొండ రోడ్డులో శనివారం ప్రత్యేక ఆక్రమణల తొలగింపు డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ కార్యాలయం నుంచి దుప్పలపల్లి రోడ్డు వరకు సుమారు 46 ఆక్రమణలను తొలగించడంతో పాటు మూడు ప్రధాన జంక్షన్లను పూర్తిగా క్లియర్ చేశారు. రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఉన్న అక్రమ నిర్మాణాలు, అడ్డంకులను తొలగించి ప్రజల రాకపోకలకు అనువుగా మార్చారు. వ్యాపారులు షెడ్లు, సైన్‌బోర్డులు, ఫ్లెక్సీలు, డబ్బా బంకులు, వస్తువుల ప్రదర్శనలు, తాత్కాలిక నిర్మాణాలు ఫుట్‌పాత్‌లు, రహదారులపై ఏర్పాటు చేయరాదని అధికారులు హెచ్చరించారు. ఫుట్‌పాత్‌లు పూర్తిగా పాదచారుల కోసమేనని, వాటిని ఆక్రమిస్తే జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నగరంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో ఇటువంటి ప్రత్యేక డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని కమిషనర్ తెలిపారు. ప్రజలు, వ్యాపారులు మున్సిపల్ కార్పొరేషన్‌కు సహకరించి నగరాన్ని ఆక్రమణల రహితంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్వైజర్ జి. శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, మున్సిపల్ జవాన్లు, కార్మికులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత..

- మొక్కలు నాటిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి.
- జూనియర్ కళాశాల ప్రాంగణంలో వన మహోత్సవం.





**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో శనివారం రోజు నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం మాట్లాడుతూ భువనగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 5 నుంచి 6 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా విస్తృత స్థాయిలో కార్యక్ర మాలు చేపడు తున్నట్లు తెలిపారు. భువనగిరి పట్టణంలో 60 వేల మొక్కలు నాటే లక్ష్యంతో వన మహోత్సవ కార్యక్ర మాలను నిర్వ హిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. పర్యావరణం బాగుంటేనే మానవ మనుగడ సురక్షితంగా ఉంటుందని, పచ్చదనం పెంపు ద్వారా స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతా వరణం అందుబాటు లోకి వస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొని పర్యా వరణ పరి రక్షణకు తమ వంతు బాధ్యతగా సహక రించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. "మొక్కలు నాటడం మాత్రమే కాదు, వాటిని సంరక్షించి పెంచడమే మనందరి బాధ్యత" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నేడు నాటిన ప్రతి మొక్కను కాపాడుతూ, భావితరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన వాతా వరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ అవేస్ చిస్తీ, జిల్లా అటవీ శాఖ అధికారి సుధాకర్ రెడ్డి, భువనగిరి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, అటవీ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కన్నయ్య "ఫాస్ట్ ఫుడ్ సెంటర్"ను ప్రారంభించిన మంత్రి సీతక్క



**ఏటూరునాగారం, ఆగస్టు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** ములుగు పట్టణ కేంద్రానికి చెందిన చెందిన యువకుడు కన్ని కి ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ మంత్రి సీతక్క,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సహకారంతో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ పెట్టడానికి ఆర్థికపరమైన సహకారాన్ని అందిస్తూ షాప్ పెట్టడానికి సహకరించగా, ఈమేరకు శనివారం రాష్ట్ర మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. యువకునికి ఆర్థిక పరమైన ఉపాధి కల్పిస్తూ సహకరించినందుకు మంత్రి సీతక్క జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ ని అభినందించారు.నూతనంగా ప్రారంభిస్తున్న కన్నయ్య ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నాణ్యతగా నిర్వహించి ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి సీతక్క గారు కన్నికి సూచించారు. అలాగే ఐ లవ్ ములు గు సర్కిల్ లో మొక్కజొన్న కంకులు అమ్ముకునే బండారుపల్లి గ్రామానికి చెందిన వృద్ధ వికలాంగురాలు నీలం సాంబాలక్ష్మికి స్టాండ్ గొడుగు అందించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి,కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్,జిల్లా అధికార ప్రతినిధి చింతనిప్పుల బిక్షపతి,డీసీసీ వైస్ ప్రెసిడెంట్ పల్లె జైపాల్ రెడ్డి,ఆత్మ కమిటీ జిల్లా డైరెక్టర్ జక్కుల రేవంత్ యాదవ్,యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మారం సుమన్ రెడ్డి,ములుగు మాజీ ఎంపీటీసీ మావురపు తిరుపతి రెడ్డి,మున్సిపాలిటీ కౌన్సిలర్ సిలువేరు సాంబయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టేవాడ తిరుపతి,ములుగు పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభినయ్ చారి,నాయకులు గంగ్రకోట సుధీర్,యూత్ నాయకులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియకు ఆగస్టు 10 వరకు గడువు పొడిగింపు..అదనపు సమయాన్ని నాణ్యత పెంపునకు వినియోగించాలి :భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్

- ఎస్ఐఆర్ అమలుపై రంగారెడ్డి జిల్లా అధికారులతో సమీక్ష.జిల్లా కలెక్టరేట్‌లో సమావేశం అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన






**రంగారెడ్డి, (జర్నలిస్ట్ ఫైల్) :** భారత ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమానికి ఆగస్టు 10 వరకు గడువు పొడిగించిన నేపథ్యంలో,లభించిన అదనపు సమయాన్ని పూర్తిగా నాణ్యత పెంపునకు వినియోగించాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ అధికారులను ఆదేశించారు.శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం అమలుపై సమీక్షా సమావేశానికి హాజరైన భారత ఎన్నికల సంఘం కార్యదర్శికి జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి సి.నారాయణ రెడ్డి,అదనపు కలెక్టర్లు కె.కిరణ్మయి,చంద్రారెడ్డి ఘన స్వాగతం పలికారు.సమీక్షా సమావేశంలో భారత ఎన్నికల సంఘం కార్యదర్శి మాట్లాడుతూ..ఇప్పటి వరకు జిల్లా అధికారులు,ఎన్నికల సిబ్బంది చేసిన కృషిని అభినందించారు.జిల్లాలో నిర్వహిస్తున్న ఓటరు అవగాహన కార్యక్రమాలు,ఫారం ఫిల్లింగ్ మేళాలు ప్రజల్లో ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని పెంచాయని ప్రశంసించారు.ప్రారంభంలో రాష్ట్ర సగటుతో పోలిస్తే డిజిటైజేషన్ వేగం తక్కువగా ఉండటంతో పురోగతిని సమీక్షించేందుకు జిల్లాకు వచ్చినట్లు తెలిపారు.ప్రస్తుతం ఎన్నికల సంఘం అదనంగా ఏడు రోజుల గడువు కల్పించిన నేపథ్యంలో,ఇప్పటికే డిజిటైజ్ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు,ఫోటోలు,పత్రాల అప్‌లోడ్ తదితర అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా నిర్ధారించాలని సూచించారు.ఈఆర్‌వోలు,ఏఈఆర్‌వోలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నాణ్యతను ధృవీకరించాలని ఆదేశించారు.పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని,ప్రతి పోలింగ్ కేంద్రాన్ని అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వ భవనాలు అందుబాటులో ఉన్న చోట వాటినే పోలింగ్ కేంద్రాలుగా వినియోగించాలని,అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ప్రైవేట్ భవనాలను ఉపయోగించాలని స్పష్టం చేశారు. మరణించిన,చిరునామా మార్చుకున్న లేదా గుర్తించలేని ఓటర్ల వివరాలను మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి కుటుంబ సభ్యులు,స్థానిక సమాచారం ఆధారంగా పూర్తిస్థాయిలో ధృవీకరించాలని సూచించారు.తద్వారా భవిష్యత్తులో వచ్చే అభ్యంతరాలు,నోటీసుల సంఖ్య తగ్గుతుందని పేర్కొన్నారు.అవసరమైతే అదనపు సహాయ ఎన్నికల నమోదు అధికారులను నియమించి పనిభారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.ఓటర్ల జాబితాలో పేర్లు గుర్తించలేకపోతున్నామని,బీఎల్‌వోలు అందుబాటులో లేరనే ఫిర్యాదులు ఎన్నికల సంఘానికి వస్తున్నాయని పేర్కొంటూ,అలాంటి సందర్భాల్లో బీఎల్‌వోలు ప్రజలకు పూర్తి సహకారం అందిస్తూ అవసరమైన దరఖాస్తులు స్వీకరించి ఎన్నికల ప్రక్రియపై స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు.రంగారెడ్డి జిల్లాలో అధికారులు,సిబ్బంది సమన్వయంతో పని చేస్తున్న తీరు సంతృప్తికరంగా ఉందని, ఇదే ఉత్సాహంతో మిగిలిన ప్రక్రియను నాణ్యతతో పూర్తి చేసి ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి ఆకాంక్షించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ..ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా,నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ అమలు చేస్తున్నట్లు తెలిపారు.జిల్లాలో మొత్తం 3,501 పోలింగ్ కేంద్రాలు,36,99,743 మంది ఓటర్లు ఉన్నారని,ఒక్కో పోలింగ్ కేంద్రానికి సగటున 1,056 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు.శేరిలింగంపల్లి,ఎల్.బీ.నగర్,రాజేంద్రనగర్,మహేశ్వరం వంటి పట్టణ నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటంతో మ్యాపింగ్ ప్రక్రియ సవాలుగా మారిందన్నారు.కొన్ని గ్రామాలు,పోలింగ్ కేంద్రాలు రెండు జిల్లాల పరిధిలో ఉండటంతో ప్రత్యేక సమన్వయంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.ప్రస్తుతం జిల్లాలో 63.53 శాతం మ్యాపింగ్ పూర్తయ్యిందని,మిగిలిన ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని,గ్రామీణ నియోజకవర్గాల్లో మంచి పురోగతి నమోదవుతుండగా,పట్టణ ప్రాంతాల్లో పెండింగ్ మ్యాపింగ్,అనామలీస్,డూప్లికేట్,నో మ్యాపింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు.ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ ప్రకారం ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు ఆగస్టు 10 వరకు గడువు పొడిగించడం జిల్లాకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు.ఈ అదనపు సమయాన్ని పూర్తిగా వినియోగించుకొని ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలిస్తామని తెలిపారు.
బీఎల్‌వోలు,బీఎల్ఏలతో కలిసి పెండింగ్ కేసులను సంయుక్తంగా ధృవీకరించి,అవసరమైన చోట ఓటర్లను నేరుగా సంప్రదించి వివరాలు సేకరిస్తామని పేర్కొన్నారు.రాజకీయ పార్టీలతో ఇప్పటికే విస్తృత సమావేశాలు నిర్వహించి అపోహలను తొలగించామని,మరోసారి ఈఆర్‌వో స్థాయిలో సమావేశాలు నిర్వహించి మిగిలిన ప్రక్రియను వేగవంతం చేస్తామని తెలిపారు.గేటెడ్ కమ్యూనిటీలకు దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను సాధ్యమైనంత వరకు అదే కమ్యూనిటీల్లో ఏర్పాటు చేసే ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని,ఓటర్లకు మరింత సౌకర్యవంతమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటే లక్ష్యమని స్పష్టం చేశారు.ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రారంభం నుంచి జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు,ప్రత్యేక శిబిరాలు,ఫారం ఫిల్లింగ్ మేళాలు నిర్వహించడం వల్ల ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు.ప్రతి అర్హుడైన ఓటరు వివరాలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఖచ్చితంగా నమోదయ్యేలా అత్యున్నత నాణ్యతతో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.సమీక్ష అనంతరం భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్,అదనపు కలెక్టర్ కె. కిరణ్మయితో కలిసి కొంగర,బొంగులూరు,ఎల్‌బీ నగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు.బీఎల్‌వోలతో మాట్లాడి ప్రక్రియ నిర్వహణ,ఎదురవుతున్న సమస్యలు,ప్రజల స్పందన తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు కె.కిరణ్మయి,చంద్రారెడ్డి, జోనల్ కమిషనర్లు,ఈఆర్‌వోలు,జిల్లా అధికారులు,ఎన్నికల విభాగం అధికారులు,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కేశంపేట పీహెచ్‌సీకి 50 కుర్చీల విరాళం

**కేశంపేట, ఆగస్టు 02 (జర్నలిస్ట్ ఫైల్) :**



బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేశంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆదేశాల మేరకు ఆయన తనయుడు, యువ నాయకుడు మురళీకృష్ణ యాదవ్ ఆసుపత్రిని సందర్శించి వైద్యులు, సిబ్బందితో సమావేశమై అక్కడి అవసరాలను తెలుసుకున్నారు. ఆసుపత్రిలో సమావేశాలు, ప్రత్యేక కార్యక్రమాలు, ఉన్నతాధికారులు లేదా అతిథులు వచ్చినప్పుడు కూర్చునేందుకు తగినన్ని కుర్చీలు లేవని, కనీసం 50 కుర్చీలు అవసరమని వైద్య సిబ్బంది వివరించారు.దీనిపై వెంటనే స్పందించిన మురళీకృష్ణ యాదవ్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సూచన మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 50 కుర్చీలను విరాళంగా అందజేశారు. అంతకుముందు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో సహకరించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, యువ నాయకుడు మురళీకృష్ణ యాదవ్‌లకు వైద్యులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నల్లవోలు మురళీధర్ రెడ్డి, సంగెం సర్పంచ్ వేణుగోపాల చారి, పార్టీ సీనియర్ నాయకులు తలసాని వెంకటరెడ్డి, కామ్లేకార్ నవీన్ కుమార్, జమాల్ ఖాన్, తిరుమల రెడ్డి శ్రీనివాస్, సోప్పరి రామకృష్ణ, సలీం, యాదగిరి, మెడికల్ ఆఫీసర్ డా. ముర్తుజ, ఫార్మసీ ఆఫీసర్ లావణ్య, నర్సింగ్ ఆఫీసర్ ప్రభావతి, ఏఎన్ఎంలు సంతోష, సుదీప్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సేవా కార్యక్రమం స్థానికంగా ప్రశంసలు అందుకుంది.

## తునికి ఖల్సలో పిజెటిఏయు రాజేంద్రనగర్ వ్యవసాయ విద్యార్థుల గ్రామీణ అధ్యయన పీఆర్ఏ కార్యక్రమం

**వర్గల్, ఆగస్టు 02 (జర్నలిస్ట్ ఫైల్) :**



ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పిజెటిఏయురాజేంద్రనగర్ 4వ సంవత్సరం విద్యార్థులు తమ 'రావెప్' అధ్యయనంలో భాగంగా సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తునికి ఖల్స గ్రామంలో 'పాల్గొనే గ్రామీణ అంచనా' పీఆర్ఏ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్థానిక రైతులతో కలిసి గ్రామానికి చెందిన భౌగోళిక నమూనా, సాగు భూములు మరియు నీటి వనరులను ప్రతిబింబించే సామాజిక పటం ప్రదర్శించారు. అనంతరం పంట దిగుబడుల పెంపు, చీడపీడల నివారణ మరియు ఆధునిక సాగు పద్ధతులపై రైతులతో ముఖాముఖి నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండగల్ల గణేష్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, టివిఆర్‌కె సీనియర్ సైంటిస్ట్ అలాగే ఆర్ఏ డబ్ల్యూఈపీ హెడ్ పల్లవి గారు, ఏఈఓ అనిత, స్థానిక గ్రామ పెద్దలు, రైతులతో పాటు వ్యవసాయ విద్యార్థినులు వెంకట హర్షిని , లావణ్య, హర్షద, భార్గవి, ప్రవీణ, అనూష తదితరులు పాల్గొన్నారు.

## ముదిగొండ మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం



**ఖమ్మం, ఆగస్టు 2(జర్నలిస్ట్ ఫైల్) :** ముదిగొండ మండలంలోని వల్లభి గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ బత్తుల రాజు కి ఇటీవల ప్రమాదం జరగడంతో చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రస్తుతం అన్‌సీజన్ కావడంతో ఆయన పరిస్థితిని గుర్తించిన ముదిగొండ మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు, జిల్లా సంఘం అధ్యక్షులు మారగాని వెంకట్, జిల్లా కోశాధికారి నిరుడు తిరుపతి సహకారంతో మొత్తం రూ 11,000/- (పదకొండు వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని సమీకరించడం జరిగింది.శనివారం జిల్లా అధ్యక్షులు మారగాని వెంకట్ చేతుల మీదుగా బత్తుల రాజు కి రూ 11,000/- ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ముదిగొండ మండల అధ్యక్షులు సామాల కోటేశ్వరరావు, కోశాధికారి మేకపోతుల చిన్నచందర్రావు, అలాగే మండలానికి చెందిన ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి ఫోటోగ్రాఫర్ సభ్యునికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని, సభ్యుల ఐక్యతే సంఘ బలమని పేర్కొన్నారు.ఈ ఆర్థిక సహాయానికి సహకరించిన జిల్లా మరియు మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## యువతా మేలుకో ! ఓటు డిజిటలైజేషన్ ప్రక్రియకు సహకరించండీ : అందే లక్ష్మణరావు



**రాజేంద్రనగర్, ఆగస్టు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** జాతీయోద్యమముతో స్వరాజ్యం సాధించిన పిదప రాజ్యాంగ బద్ధమైన ప్రాథమిక ఓటు హక్కును కలిగి ఉండడం ప్రతి పౌరుడు బాధ్యత అని బిఆర్ఎస్ పార్టీనాయకులు అందే లక్ష్మణ్ రావు తెలిపారు.ఓటును సద్వినియోగ పరుచు కోవాలంటే ముందు ఓటు డిజిటలైజేషన్ ప్రక్రియకు స్పందించి ఓటు హక్కును తప్పకుండా పొందాలని అన్యధా ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం పొంచి ఉన్నదని అన్నారు,అందుకు అనుగుణంగా ఎన్నికల సంఘం డిజిటలైజేషన్ ప్రక్రియను మళ్లీ ఒకసారి ఆగస్టు10 వరకు పొడిగించడం సముచితమే కాగా ఈ సదవకాశాన్ని ప్రత్యేకంగా యువత సద్వినియోగ పరుచు కోవాలని కోరారు.అందులో భాగంగా బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు తలపెట్టిన ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సహాయ శిబిరంలో శనివారం ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఓటు ఎన్యుమరేషన్ ఫారం ఏ బి.ఎల్.ఓ వద్ద లభిస్తుందో వివరాలు తెలియ పరచడం,2002 లో వారి యొక్క లేదా వారి పరివారం సభ్యుల ఓటు వివరాలను తెలియజేస్తూ తద్వారా ఎన్యూమరెశన్ ధరకాస్తూ ఫారం పూరించి మ్యాపింగ్ చేయడంలో సంపూర్ణ సహకారన్ని అందించడం జరిగిందని మణికొండ,నెక్నంపుర్ డివిజన్ బి.ఆర్.ఎస్ నాయకులు గుట్టమీద నరేందర్ అందే లక్ష్మణ్ రావు,షైక్ ఆరీఫ్,భాను చందర్ తదితరులు తెలిపారు.

## వైద్య ఆరోగ్యశాఖ అధికారిని కలసిన ఐ ఎన్ టియు జిల్లా నాయకులు



**వరంగల్, ఆగస్టు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** వరంగల్ వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ బొమ్మన రాజారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టియుసి వరంగల్ జిల్లా నాయకులు శనివారం ఆయనను మర్యాదపుర్వాకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు.వరంగల్ కార్పొరేషన్ మున్సిపల్ కార్యాలయంలో సుదీర్ఘకాలం పనిచేసిన రాజారెడ్డి ఈ కార్యక్రమం పూర్తి చేయడం అభినందనీయమని, మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ సహాయ సహకారాలు అందజేయడం,ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని వారు సూచించారు.ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు .ఐ న్ టీ యూ సి వరంగల్ జిల్లా నాయకులు పుల్ల రమేష్, జిల్లా అధ్యక్షుడు,పాశం రవి యాదవ్, గ్రేటర్ సంగం అధ్యక్షుడు, మెడికల్ అండ్ ఎల్త్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్, ఎల్త్ ఇన్స్పెక్టర్ జి. మధుకర్, గ్రేటర్ కార్యా దర్శి డి. రమేష్,జి. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హామీలను అమలు చేయాలి

- సెప్టెంబర్ ఒకటిన ఛలో ఢిల్లీ
- ఎన్ఎఫ్ఐడబ్ల్యూ కౌన్సిల్ సమావేశంలో లతాదేవి




**ఖమ్మం, ఆగస్టు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ అనుబంధం) జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి డిమాండ్ చేశారు. ఉచిత బస్సు తప్ప మహిళలకు ఇచ్చిన ఏ హామీని ప్రభుత్వం అమలు చేయలేదని ఆమె ఆరోపించారు. తెలంగాణ మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా కౌన్సిల్ సమావేశం శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. జిల్లా అధ్యక్షురాలు బత్తినేని నీరజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో లతాదేవి మాట్లాడుతూ ప్రతి మహిళ ఖాతాలో –నెలకు రూ.2,500 జమ చేస్తామని, కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా ఆడపిల్లలకు తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని, ఎందుకు –అమలు చేయడం లేదని ఆమె ప్రశ్నించారు. విద్యను అభ్యసిస్తున్న యువతులకు స్కూటీలు సైతం అందిస్తామని చెప్పారని కానీ హామీల అమలు దిశగా కాంగ్రెస్ పాలన సాగడం లేదని లతాదేవి తెలిపారు. మహిళలను లక్షాధికారులను చేస్తాం, కోటీశ్వరులను చేస్తామని చెబుతున్నారు తప్ప "అది ఆచరణలో తద్ విరుద్ధ ఫలితాలు వస్తున్నాయని ఆమె తెలిపారు. వడ్డీ లేని రుణాలతో జరుగుతున్న అన్యాయాన్ని నిలువరించాలని ఆమె కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తుందని ముఖ్యంగా మహిళలను కించపరిచే రీతిలో బిజెపి అనుబంధ సంఘాల నాయకులు మాట్లాడుతున్నారని ఆమె తెలిపారు. అత్యాచార ఘటనకు సంబంధించి విశ్వ హిందూ పరిషత్ నాయకులపై కేసులు నమోదు చేయాలని మోహన్ దాస్ను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. జంతర్ మంతర్ వద్ద సెప్టెంబర్ ఒకటిన జరిగే ప్రజా ఆందోళనలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు. మహిళా సమాఖ్య బలోపేతానికి కార్యాచరణ రూపొందించినట్లు –ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు పోటు కళావతి, కార్యనిర్వహక అధ్యక్షురాలు సిహెచ్ –సీతామహాలక్ష్మి , సంఘ బాధ్యులు దండి శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

# సురభి సంస్థ లోగోను ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు

**మంథని, ఆగస్టు 02 (జర్నలిస్ట్ ఫైల్) :**



140 సంవత్సరాల చరిత్ర కలిగిన సురభి నాటక సంప్రదాయానికి చెందిన శ్రీ లక్ష్మీనరసింహ సాయి వెంకటేశ్వర నాట్యమండలి సురభి సంస్థ లోగోను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శనివారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భారతీయ సంస్కృతికి ప్రతీకలైన ప్రాచీన కళారూపాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సుమారు 140 సంవత్సరాల చరిత్ర కలిగిన సురభి నాటక సంప్రదాయం తెలుగు కళా వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిందని కొనియాడారు. ఇలాంటి గొప్ప కళాసంస్థ లోగోను ఆవిష్కరించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.సంప్రదాయ కళలను ప్రోత్సహించి భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. కళాకారులను ప్రోత్సహించడం ద్వారా సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామ సేవా సదన్ అధ్యక్షుడు, మంథని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వి.ఎల్.ఎన్. (కర్ని) హరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సాయేందర్ రెడ్డి, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాంచంద్రరావు, సురభి సంస్థ వ్యవస్థాపకుడు సురభి వెంకటేష్ ప్రసాద్, సింగరేణి రిటైర్డ్ డీజీఎం లక్ష్మీనారాయణ, వంగ రాజసమ్మయ్య, కొండ సమ్మన్న, శశి భూషణ్ కాచె, ప్రజాప్రతినిధులు, కళాకారులు, సాంస్కృతిక రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

# సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ తెరిపించే వరకు రైతు ఉద్యమం

## : ఆకుల పాపయ్య

**నిజామాబాద్, ఆగస్టు 02 (జర్నలిస్ట్ ఫైల్) :**




గత 16 ఏళ్లుగా మూతపడిన ఎన్‌సీఎస్ఎఫ్ (NCSF) సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించే వరకు రైతులతో కలిసి ఉద్యమాన్ని కొనసాగిస్తామని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ ఆకుల పాపయ్య అన్నారు. శనివారం మోపాల్ మండలం కంజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ మూతపడటంతో నాలుగు నియోజకవర్గాల పరిధిలోని 110 గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రస్తుతం చెరుకు సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నందున ప్రభుత్వం రూ.100 కోట్ల నిధులు కేటాయించి ఫ్యాక్టరీని వెంటనే పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచి చెరుకు సాగును ప్రోత్సహించాలని కోరారు. ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ, సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని పునఃప్రారంభించి ప్రభుత్వ ఆధ్వర్యంలో బెల్లం కేంద్రంగా నిర్వహించాలని కోరారు. ఈ విషయంలో బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు మాక్ ఎలక్షన్

- కాకతీయ హైస్కూల్‌లో వినూత్న కార్యక్రమం
- ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి




**మంథని, ఆగస్టు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు పెంపొందించడంతో పాటు ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించే లక్ష్యంతో కాకతీయ హైస్కూల్‌లో శనివారం మాక్ ఎలక్షన్‌ను నిర్వహించారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి తెలిపారు.భారత ఎన్నికల సంఘం నిర్వహించే ఎన్నికల మాదిరిగానే నామినేషన్ల స్వీకరణ, ఎన్నికల ప్రచారం, రహస్య ఓటింగ్, బ్యాలెట్ బాక్స్ ద్వారా పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన వరకు అన్ని దశలను విద్యార్థుల సమక్షంలో నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించారు.ఎన్నికల్లో హెడ్ బాయ్‌గా బి. కౌశిక్, హెడ్ గర్ల్‌గా విశ్వశ్రీ, స్పోర్ట్స్ సెక్రటరీగా ఓంకార్, డిప్యూటీ హెడ్ బాయ్‌గా శ్రీ నాగచైతన్య, డిప్యూటీ హెడ్ గర్ల్‌గా అంజలి ప్రియ ఎన్నికయ్యారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సామాజిక కార్యకర్త కనుకుంట్ల స్వామి భారత ఎన్నికల వ్యవస్థ, ఓటు హక్కు ప్రాముఖ్యత, బాధ్యతాయుతమైన ఓటరు విధులపై విద్యార్థులకు వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి పౌరుడు తన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు.ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ, చిన్నప్పటినుంచే విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు ఈ మాక్ ఎలక్షన్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఎన్నికల నిర్వహణ విధానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకుని, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగేందుకు అవసరమైన అవగాహన పొందారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని మాక్ ఎలక్షన్‌ను విజయవంతం చేశారు.

# ఎంపీ వద్దిరాజుకు ఆహ్వానం



**ఖమ్మం, ఆగస్టు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** కోకాపేటలో నిర్మిస్తున్న ఆత్మగౌరవ భవనం ప్రాంగణంలో కేంద్ర మాజీ మంత్రి పుంజాల శివశంకర్ విగ్రహాన్ని నెలకొల్పేందుకు అనుమతి మంజూరు చేయాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్,ఎం.కే.ఫౌండేషన్ చైర్మన్ వద్దిరాజు రవిచంద్రను మున్నూరుకాపు ఆత్మగౌరవ మహా ధర్నసేన విజ్ఞప్తి చేసింది.ఈ మేరకు ధర్నసేన రాష్ట్ర కన్వీనర్ ఉగ్గే శ్రీనివాస్ పటేల్,కో–కన్వీనర్ అమరం శ్యాం కుమార్ లు ఎంపీ రవిచంద్రను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు.విద్యా,ఉద్యోగ రంగాలలో బీసీల రిజర్వేషన్ల కల్పనకు విశేష కృషి చేసిన స్వర్గీయ శివశంకర్ విగ్రహాన్ని నెలకొల్పేందుకు ఎంపీ రవిచంద్ర సానుకూలంగా స్పందించారు.దివంగత నాయకులు శివశంకర్ జయంతి సందర్భంగా ఆగస్ట్ 10వతేదీన (సోమవారం)జరిగే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావలసిందిగా శ్రీనివాస్ పటేల్, శ్యాం కుమార్ లు ఎంపీ వద్దిరాజును ఆహ్వానించారు.

# ఎస్ఐఆర్ అభియాన్ విజయవంతానికి బీఎల్ఏలతో బీజేపీ కీలక సమావేశం

- సిరికొండ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా కర్కా గంగారెడ్డి హాజరు – పార్టీ నాయకులకు దిశానిర్దేశం



**నిజామాబాద్, ఆగస్టు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** సిరికొండ మండల కేంద్రంలో ఈరోజు ఎస్ఐఆర్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీఎల్ఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ నాయకులు కర్కా గంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఎస్ఐఆర్ అభియాన్ విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై నాయకులకు సూచనలు చేశారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నక్క రాజేశ్వర్, మండల అధ్యక్షుడు గుర్రం సంజీవరెడ్డి, జిల్లా నాయకులు అల్లూరి రాజేశ్వర్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి గంగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మలోత్ రాజేందర్, యువ మోర్చా అధ్యక్షుడు మధు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రభాకర్, రంజిత్ రెడ్డి, గోపి, మండల కార్యదర్శులు సుమన్, శ్రీనివాస్, నరేశ్, ఈ. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రులను కలిసిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్



**నిజామాబాద్, ఆగస్టు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** శనివారం నిజామాబాద్ జిల్లా పోచంపాడ్ ఎస్సారెస్పీ ప్రాజెక్టును పరిశీలించేందుకు వచ్చిన రాష్ట్ర భారీ నీటిపారుదల,పౌర సరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,ఐ.టీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు లను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందించి స్వాగతం తెలిపిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య.

# ఘనంగా పింగళి, బళ్ళారి జయంతి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ): భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య, ప్రముఖ రంగస్థల కళాకారుడు బళ్ళారి రాఘవ జయంతి ఆదివారం ఘనంగా జరిగింది. కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఆసుతోష్ శ్రీవాస్తవ పింగళి వెంకయ్య, బళ్ళారి రాఘవ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి విశిష్ట సేవలు అందించిన మహనీయులను వారి జయంతి సందర్భంగా స్మరించుకోవడం, వారు సమాజానికి చేసిన సేవలను గుర్తుచేసుకోవడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. స్వాతంత్ర సమరయోధుడు దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవం రోజున గర్వంగా ఎగురవేస్తున్న భారత జాతీయ పతాకాన్ని రూపొందించిన పింగళి వెంకయ్య భారతదేశానికి చిరస్మరణీయమైన సేవ చేసిన మహనీయులని కొనియాడారు. కళారంగంలో అసాధారణ ప్రతిభ కనబరిచిన బళ్ళారి రాఘవ నటనా వైభవం గొప్పదని చెప్పారు. క్రిమినల్ లాయర్ గాను ఆయన సేవలకు బ్రిటీష్ ప్రభుత్వ ప్రశంసలు కూడా పొందారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్టెప్ సి.ఇ.ఓ పి.వి. ఎన్. సత్యనారాయణ, కలెక్టరేట్ ఏ ఓ మల్లీశ్వరి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ టోల్‌ఫ్రీ నంబర్ 1100తో అర్జీల స్థితి తెలుసుకోవచ్చు

- మీకోసం వెబ్‌సైట్‌లోనూ ఫిర్యాదుల నమోదు అవకాశం : కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 1100కు కాల్ చేసి అర్జీల స్థితిగతులను తెలుసుకోవచ్చని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు.

ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు మండల స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు నేరుగా హాజరై తమ వినతులను సమర్పించవచ్చని పేర్కొన్నారు.

అలాగే, 'మీకోసం' వెబ్‌సైట్ ద్వారా కూడా ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 1100 టోల్‌ఫ్రీ నంబర్ను వినియోగించి దరఖాస్తుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని సూచించారు.

ప్రజలు అందుబాటులో ఉన్న ఈ సేవలను సద్వినియోగం చేసుకుని తమ సమస్యల పరిష్కారం కోసం పీజీఆర్ఎస్, మీకోసం వెబ్‌సైట్, టోల్‌ఫ్రీ నంబర్ 1100 సేవలను ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ కోరారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి



- ఐదుగురు అదుపులోకి.. 13 బైక్‌లు, ఆటో, సెల్‌ఫోన్లు స్వాధీనం

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ): గుంటూరు జిల్లా నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏటుకూరు గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్, నల్లపాడు పోలీసుల సంయుక్త బృందం ఆకస్మిక దాడి నిర్వహించి ఐదుగురిని అదుపులోకి తీసుకుంది.

పోలీసుల వివరాల ప్రకారం, శనివారం అర్ధరాత్రి సుమారు 12.40 గంటల సమయంలో ఏటుకూరు గ్రామంలోని జగనన్న కాలనీ సమీపంలోని పంట పొలాల మధ్య పేకాట జరుగుతున్నట్లు టాస్క్ ఫోర్స్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ సమాచారాన్ని డీఎస్‌బీ డీఎస్పీకి తెలియజేయగా, సీఐ-2 ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్, నల్లపాడు పోలీస్ స్టేషన్ సిబ్బంది సంయుక్తంగా ఘటనాస్థలికి చేరుకుని దాడి నిర్వహించారు.

దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి 13 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, నాలుగు సెల్‌ఫోన్లు, రూ. 4 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

స్వాధీనం చేసుకున్న నగదు, వాహనాలు, ఇతర వస్తువులను తదుపరి విచారణ, చట్టపరమైన చర్యల కోసం నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# రౌడీ షీటర్లకు గుంటూరు పోలీసుల కౌన్సిలింగ్



- నేరాలకు దూరంగా ఉండి చట్టబద్ధమైన జీవనం సాగించాలి : పోలీసుల సూచన

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గుంటూరు జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, చెడు నడత కలిగిన వారికి ఆదివారం ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించారు.

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసులు రౌడీ షీటర్లకు చట్టబద్ధమైన జీవనం గడపాలని సూచించారు. గతాన్ని మరచి చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా సమాజంలో మంచి పేరు తెచ్చుకునేలా ప్రవర్తించాలని హితవు పలికారు.

ఎలాంటి నేరాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలని, ప్రజల ప్రశాంతతకు, శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రౌడీ షీటర్లు, నేరప్రవృత్తి కలిగిన వ్యక్తుల కదలికలపై జిల్లా పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తున్నామని, శాంతియుత సమాజ నిర్మాణానికి ప్రజల సహకారం కూడా అవసరమని పోలీసులు పేర్కొన్నారు.

# పేదలకు తక్కువ ధరకు సన్న బియ్యం.. గుంటూరులో విక్రయ కేంద్రం ప్రారంభం

- రేషన్ దుకాణాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి.. అక్రమాలకు కఠిన చర్యలు: ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ): పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన సన్న బియ్యం, స్టీమ్ బియ్యాన్ని అందుబాటు ధరల్లో అందించేందుకు ఎన్డీయే ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

గుంటూరు నగరంలోని 25వ డివిజన్ చుట్టుగుంట రైతు బజార్‌లో ఆదివారం రైతు బజార్లు, రైస్ మిల్లుల అవుట్‌లెట్ స్టోర్ల ద్వారా తక్కువ ధరలకు బియ్యం విక్రయాల కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మార్కెట్లో రూ. 52 నుంచి రూ. 58 వరకు విక్రయమవుతున్న సన్న బియ్యాన్ని రూ. 50కే, రూ. 62 వరకు ఉన్న స్టీమ్ బియ్యాన్ని రూ. 52కే రేషన్ కార్డుదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఈ కార్యక్రమం ఊరటనిస్తుందని పేర్కొన్నారు.

గతంలో కందిపప్పును కూడా రైతు బజార్ల ద్వారా రాయితీ ధరలకు అందించినట్లు గుర్తు చేసిన ఆమె, ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఈ బియ్యం విక్రయాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని చెప్పారు.

చుట్టుగుంట రైతు బజార్‌లో పార్కింగ్ సమస్య, స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు వంటి స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుని రైతు బజార్‌ను మరింత ప్రజలకు అనుకూలంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

రేషన్ పంపిణీలో పారదర్శకత కోసం పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి రేషన్ దుకాణంలో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఇప్పటికే డీలర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు, మరో పది రోజుల్లో అన్ని రేషన్ దుకాణాల్లో కెమెరాల ఏర్పాటు పూర్తవుతుందని తెలిపారు. ప్రజలకు చెందాల్సిన బియ్యం ప్రజలకే చేరేలా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేస్తామని చెప్పారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా, పంపిణీలో మాల్‌ప్రాక్టీసులపై ప్రభుత్వం తీవ్రంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఫిర్యాదులు అందిన వెంటనే అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారని, అక్రమాలకు పాల్పడిన వారిపై లైసెన్సులు రద్దు చేయడం, దుకాణాలను మూసివేయడం వంటి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు తేలితే వారి హోదాతో సంబంధం లేకుండా చర్యలు తప్పవని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ అధికారులు, ఎంఆర్వో, డీఎస్ఓ, రైతు బజార్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# అమరావతి చిత్రకళా ఉత్సవాన్ని విజయవంతం చేయండి

- ఈ నెల 8 , 9 తేదీల్లో విద్యానగర్లో ఉత్సవాల నిర్వహణ
- కళాకారులకు ఇది ఒక గొప్ప వేదిక
- కార్యక్రమంపై చర్చించిన ఎమ్మెల్యే నసీర్, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి చైర్మన్ తేజస్వి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):చిత్రకళలకు ప్రతి ఒక్కరూ ఆదరించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ పిలుపునిచ్చారు. ఈ నెల 8,9 తేదీల్లో స్థానిక విద్యానగర్లో నిర్వహించనున్న అమరావతి చిత్రకళా వీధి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ను రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి చైర్మన్ పొడపాటి తేజస్వి కలిసి కోరారు. చిత్ర కళని గేలరీలకే పరిమితం చేయకుండా సామాన్య ప్రజలకి చేరువ చేయాలనే లక్ష్యంతో వీధినే గేలరీగా మార్చి చిత్రకళని ఒక ఉత్సవంగా చేస్తున్నామన్నారు. ప్రతిష్టాత్మక ఉత్సవం దేశవ్యాప్తంగా ఉన్న ప్రఖ్యాత, ఔత్సాహిక కళాకారులను ఒకచోట చేర్చి, వారి కళాత్మక వ్యక్తీకరణని, లసాంస్కృతిక వారసత్వాన్ని ఒక పండగలా నిర్వహించనున్నారని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. ఈ ఉత్సవంలో ప్రత్యక్ష (లైవ్) కళా ప్రదర్శనలు, వర్క్‌షాప్‌లు, ఇంటరాక్టివ్ సెషన్‌లు, ప్రదర్శనలు ఉంటాయన్నారు. కళా ఔత్సాహికులు, విద్యార్థులు, నిపుణులు ప్రముఖ చిత్ర కళాకారులతో చర్చించేందుకు, వివిధ సృజనాత్మక కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు.

విశిష్ట కళాకారులకు సత్కరిస్తారని, ఇది చిత్రకళా సమాజానికి ఒక ఉత్సాహభరితమైన వేదిక కానుందని చెప్పారు. ఈ ప్రాంత సాంస్కృతిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి మద్దతివ్వాలనే దృష్టితో రిజిస్ట్రేషన్ ఫీజు ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వ పాఠశాల పిల్లలకు పెయింటింగ్ కిట్లు ఇవ్వడానికి ఉపయోగిస్తారని తెలిపారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామికి, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారికీ ప్రత్యేక పూజలు



తెనాలి (జర్నలిస్ట్ ఫైల్ ): స్థానిక బాలాజీరావుపేట లోని ప్రియ థియేటర్ ఎదురు గల కోట బద్రీనాథ్ స్థలం నందు శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ ఆధ్వర్యంలో సామూహిక శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. తొలుత శ్రీ వెంకటేశ్వర స్వామికి, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారికి ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి సంకీర్తన సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు ఆర్. వి. కిరణ్ కుమార్ మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నారాయణ అక్షర దివ్య క్షేత్రం కు సేకరిస్తున్న భూదాన కైంకర్య సేవకు అనేక మంది భక్తులు ముప్పై అడుగుల భూదాన విరాళాన్ని అంద చేయడం జరిగిందన్నారు. ఎంతో పవిత్రమైన భూదాన కైంకర్య సేవలో యువత పాల్గొనడం సంతోషకరమన్నారు.

ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించనున్న నారాయణ అష్టాక్షరి దివ్య క్షేత్రం కు భక్తులందరూ తమ శక్తి కొలది భూదాన విరాళ కైంకర్య సేవలో పాల్గొనాలని పేర్కొన్నారు.

వ్యాపారవేత్తలు కోట మోహన్ రావు, పెనుగొండ సత్యనారాయణ గుప్తా మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించనున్న నారాయణ అష్టాక్షరి దివ్య క్షేత్రం కు తెనాలి పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు విరివిగా సహకారం అందించాలని పేర్కొన్నారు. అనంతరం భూదాన విరాళం అందజేసిన దాతలకు ట్రస్టు సభ్యులు అభినందించి జ్ఞాపికను అందజేశారు.

కార్యక్రమంలో ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, ముదుపల్లి చంద్రశేఖర్, గుడివాడ బాలకృష్ణ, జంజం రామారావు, శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, ట్రస్ట్ విద్యా కమిటీ అధ్యక్షులు కోట బద్రీనాథ్ గుప్తా , సేవాదళ్ కమిటీ అధ్యక్షులు కోటా లీలా సత్యనారాయణ గుప్త, ట్రస్టు సభ్యులు రొంపిచర్ల సురేష్ ,మాజేటి వెంకటేష్ , గోలీ సోమశేఖర్, అంబటి శ్రీనివాసరావు, మద్దు హరీష్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# రెండు నెలలుగా వేతనాలు లేక సమగ్ర శిక్ష ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు

- పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలని ఆప్టా డిమాండ్

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలోని సమగ్ర శిక్ష (సమగ్ర శిక్ష అభియాన్)లో పనిచేస్తున్న సుమారు 23 వేల మంది ఉద్యోగులకు గత రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడు కె. ప్రకాష్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.జి. మెహది ఆందోళన వ్యక్తం చేశారు.

ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ, రాష్ట్రంలోని 28 జిల్లాల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు కుటుంబ పోషణ కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల బోధన, బోధనేతర సిబ్బంది, క్లస్టర్ రిసోర్స్ మొబైల్ ఉపాధ్యాయులు, నిర్వహణ సమాచార వ్యవస్థ సమన్వయకర్తలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అకౌంట్స్ సిబ్బంది, సైట్ ఇంజినీర్లు, ఫిజియోథెరపిస్టులు, సమ్మిళిత విద్య వనరుల ఉపాధ్యాయులు, మెసెంజర్లు, పార్ట్‌టైమ్ బోధకులు, జిల్లా ప్రాజెక్టు కార్యాలయ సిబ్బంది తదితరులు వేతనాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రతి నెల జీతంపైనే ఆధారపడే వేలాది కుటుంబాలు ఇంటి అద్దెలు, బ్యాంకు రుణాల ఈఎంఐలు, పిల్లల విద్యా ఫీజులు, వైద్య ఖర్చులు, నిత్యావసరాల వ్యయాలను భరించలేని పరిస్థితిలో ఉన్నాయని పేర్కొన్నారు. కొందరు ఉద్యోగులు బంధువులు, స్నేహితుల వద్ద అప్పులు చేయగా, మరికొందరు ఇంటి వస్తువులను తాకట్టు పెట్టి కుటుంబాలను పోషిస్తున్నారని తెలిపారు.

ఇంతటి క్లిష్ట పరిస్థితుల్లోనూ సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కార్యక్రమాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల నిర్వహణ, ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు సేవలు, శిక్షణ కార్యక్రమాలు, డేటా నిర్వహణ, ప్రభుత్వ ఆదేశాల అమలు వంటి బాధ్యతలను ఎలాంటి ఆటంకం లేకుండా నిర్వర్తిస్తున్నారని చెప్పారు.

ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దీనిని పరిపాలనా సమస్యగా కాకుండా 23 వేల కుటుంబాల జీవనాధారానికి సంబంధించిన అత్యవసర మానవతా సమస్యగా పరిగణించి వెంటనే స్పందించాలని కోరారు.

పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను తక్షణమే విడుదల చేయాలని, ఇకపై ప్రతి నెల నిర్దిష్ట తేదీన జీతాలు చెల్లించే శాశ్వత విధానాన్ని అమలు చేయాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఆర్థిక భద్రత కల్పించే చర్యలు చేపట్టాలని ఆప్టా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను ముందుకు నడిపిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# నైపుణ్యాలతోనే మహిళ ప్రగతి : గ్రంథాలయ సంస్థ చైర్మన్ భీమినేని వందనా దేవి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారానే ప్రగతి సాధ్యమౌతుందని, కుటుంబ ఆదాయాలు పెరుగుతాయని, మహిళలలో ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం పెరిగి వారి పట్ల గౌరవం పెరుగుతుందని గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్ పర్సన్ భీమినేని వందనా దేవి పేర్కొన్నారు. ఈనెల 2వ తేదీన ఆదివారం గుంటూరులోని జిల్లా గ్రంథాలయ సంస్థ హాలులో మానవత ఆధ్వర్యంలో శారీ డ్రేపింగ్ శిక్షణ కార్యక్రమం కె. సతీష్ నేతృత్వంలో జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన భీమినేని వందనాదేవి ప్రసంగిస్తూ ఫ్యాషన్ రంగంలో అపారమైన అవకాశాలు పెరుగుతున్నాయని, మహిళలు వాటిని అందిపుచ్చుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. డ్వాక్రా గ్రూపుల ద్వారా లభించే ఋణ సదుపాయాన్ని వ్యాపారాలు చేయడానికి వినియోగించి సంపదను సృష్టించాలని కోరారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ప్రపంచంలో జనాభాలో మొదటి స్థానంలో 147 కోట్లతో ఉన్నప్పటికీ నైపుణ్యాల కొరతతో వెనుకబడి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యతలో దేశంలోనే అట్టడుగున 36వ స్థానంలో ఉందని, ప్రతి ముగ్గురి మహిళలలో ఒకరు నిరక్షరాస్యులుగా కొనసాగుతున్నారన్నారు. శిక్షణ శిబిరం కోఆర్డినేటర్ కె. సతీష్ ప్రసంగిస్తూ వివిధ ప్రాంతాల నుండి 120 మంది మహిళలు శారీ డ్రేపింగ్ శిక్షణలో పాల్గొని మెలుకువలను నేర్చుకోవటం అభినందనీయమన్నారు. నేర్చుకున్న నైపుణ్యాలను మరింత సాధన చేసి ఆర్థికంగా స్వయం ఉపాధి పొందాలని మహిళలను కోరారు. శిక్షణ శిబిర ట్రైనర్, ప్రముఖ బ్యూటీషియన్ కుమారి పట్టపు స్వప్న ప్రసంగిస్తూ ఫ్యాషన్ రంగంలో తాను ఎదిగిన అనుభవాలను వివరిస్తూ ప్రతి ఒక్కరూ అందివస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా మానవత సంస్థ 5 వేల రూపాయలు విలువ గల పోటీ పరీక్షల పుస్తకాలను జిల్లా గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రరియన్ ఝాన్సీ లక్ష్మి కు అందజేశారు. అతిథులు శిక్షణ పొందిన ప్రతి మహిళకు ట్రైనింగ్ సర్టిఫికేట్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మానవత సెక్రటరి చావా శివాజీ, డైరెక్టర్ వేజెండ్ల బాలకృష్ణ చౌదరి, ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ టి. సాయిరాం, పూర్వ అధ్యక్షులు డా॥ కోటా శ్రీనివాస్, డైరెక్టర్ ఎన్. సాంబశివరావు, జాయింట్ సెక్రెటరీ మహేశ్వర రావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# బళ్లారి రాఘవ సేవలు చిరస్మరణీయం: గుంటూరు జిల్లా పోలీసు యంత్రాంగం



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):ప్రముఖ నాటకకర్త, న్యాయవాది, స్వాతంత్ర్య సమరయోధుడు, నాటక కళాప్రపూర్ణ బళ్లారి రాఘవ (తడిపత్రి రాఘవాచార్యులు) జయంతి వేడుకలను గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పోలీసు అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఆర్ఆర్ఐ కృష్ణయ్య మాట్లాడుతూ తెలుగు నాటకరంగాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లిన మహనీయుడు బళ్లారి రాఘవ అని కొనియాడారు. తెలుగు నాటకరంగానికి ఆయన అందించిన సేవలు అసమానమని, సమాజంలో చైతన్యం తీసుకురావడానికి నాటకాలను శక్తివంతమైన సాధనంగా వినియోగించారని పేర్కొన్నారు. క్రమశిక్షణ, సేవాభావం, సమాజ శ్రేయస్సు కోసం బళ్లారి రాఘవ చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గురువులకు ఘన సన్మానం



- వినూత్నంగా రిటైర్మెంట్ వేడుక నిర్వహించిన డెప్యూటీ రిజిస్ట్రార్ పురుషబాబు

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): ఉద్యోగ విరమణ సందర్భంగా తనను సన్మానించుకోవడం కాకుండా తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించి సహకార శాఖ డెప్యూటీ రిజిస్ట్రార్ చిలుకూరి పురుషబాబు ఆదర్శంగా నిలిచారు.

ఆదివారం గుంటూరులోని ఎస్‌వీఎన్ కాలనీలోని గ్రాండ్ వెంకటేష్ హోటల్‌లో నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమంలో గ్రూప్-1 అధికారిగా పదవీ విరమణ పొందిన పురుషబాబు, తన విద్యాభ్యాసానికి మార్గనిర్దేశం చేసిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళాశాల (ధరణికోట), వికాస్ కళాశాల (గుంటూరు) అధ్యాపకులను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. మేళతాళాల నడుమ పుష్పమాలలు, పట్టు శాలువాలు, నూతన వస్త్రాలు, జ్ఞాపికలతో గురువులను గౌరవించారు. ఈ సందర్భంగా అధ్యాపకుడు నూతలపాటి తిరుపతయ్య మాట్లాడుతూ, ఉద్యోగ జీవితానికి వేడుకల మధ్య ముగింపు పలకడం పదవీ విరమణ పొందే వ్యక్తిలో సానుకూల మానసిక, భావోద్వేగ మార్పులకు దోహదపడుతుందని అన్నారు. పురుషబాబు మాట్లాడుతూ, 37 ఏళ్ల ఉద్యోగ జీవితం నిశ్శబ్దంగా ముగియకూడదనే ఉద్దేశంతో తన విజయానికి పునాది వేసిన గురువులను సన్మానించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. జీవితంలో గురువుల పాత్రను గుర్తుచేసుకుంటూ వారికి కృతజ్ఞతలు తెలియజేయడం తన బాధ్యతగా భావించానన్నారు. అనంతరం గురువులందరూ పురుషబాబు దంపతులను ఆశీర్వదించి సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు గుమ్మడి సీతారామయ్య చౌదరి, నాగరాజు శ్రీనివాస్, ఆమని రమేష్ బాబు, కిలారి చంద్రశేఖర్, గద్దె ఆంజనేయులు, నంబూరి కోటేశ్వరరావు, రామినేని భ్రమరాంబ, వెలినేని మహేష్, శశి తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 5న మెగా జాబ్ మేళా

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 5న గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని శ్రీ ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు తెలిపారు. ప్రత్తిపాడు శాసనసభ్యులు డా. బూర్ల రామాంజనేయులు ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాలో 45 ప్రముఖ కంపెనీలు పాల్గొని సుమారు 1,450 ఉద్యోగాల భర్తీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, బీ.ఫా ర్మసీ, ఎంబీఏ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల అభ్యర్థులు పాల్గొనడానికి అర్హులని తెలిపారు. జాబ్ మేళా ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులకు ఇంటర్వ్యూ నైపుణ్యాలపై ఉచిత అవగాహన, శిక్షణ కార్యక్రమాలను ఆగస్టు 3, 4 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అదే వేదికలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## పింగళి వెంకయ్యకు బీజేపీ నివాళి



○ **జాతీయ పతాక రూపకర్త సేవలు చిరస్మరణీయం**

○ **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** భారత జాతీయ పతాక రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య 150వ జయంతి సందర్భంగా బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో పింగళి వెంకయ్య సేవలు చిరస్మరణీయమని మాధవ్ పేర్కొన్నారు. జాతీయ పతాక రూపకర్తగా ఆయన భారతదేశానికి అందించిన సేవలు యుగయుగాల పాటు గుర్తుండిపోతాయని అన్నారు.

భారత జాతీయ పతాకం కేవలం ఒక జెండా మాత్రమే కాదని, దేశ సమైక్యతకు, సార్వభౌమత్వానికి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు, దేశభక్తికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ విశ్వాసాన్ని సంపాదించి, భారత జాతీయోద్యమానికి అంకితభావంతో సేవలందించిన పింగళి వెంకయ్య ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమైన మహనీయుడని తెలిపారు. దేశం కోసం అంకితభావంతో పనిచేయడం, జాతీయ గౌరవాన్ని పరిరక్షించడం, దేశభక్తిని పెంపొందించడం వంటి విలువలను యువత అలవరచుకోవాలని పిలుపునిచ్చారు.

పింగళి వెంకయ్య ఆశయాలను స్మరించుకుంటూ జాతీయ పతాక గౌరవాన్ని కాపాడటం ప్రతి భారతీయుడి బాధ్యత అని మాధవ్ పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను భావితరాలకు తెలియజేస్తూ దేశభక్తి భావనను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పింగళి వెంకయ్య చూపిన దేశసేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

## డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై అపోహలు వద్దు

○ **ఆగస్టు 30 వరకు మార్పులు, చేర్పులకు అవకాశం..**

○ **ప్రతి ఓటరు వివరాలు పరిశీలించుకోవాలి**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల నేపథ్యంలో ప్రజలు ఎలాంటి అపోహలు, భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి. సుబ్బారావు అన్నారు. ఎవరి ఓటు హక్కు కూడా శాశ్వతంగా కోల్పోదని, భారత ఎన్నికల సంఘం ఆగస్టు 30 వరకు మార్పులు, చేర్పులు చేసుకునేందుకు అవకాశం కల్పించిందని తెలిపారు.

ప్రతి ఓటరు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో తన పేరు, చిరునామా, ఇతర వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఏవైనా తప్పులు ఉంటే సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి నిర్ణీత గడువులోగా సవరణలు చేయించుకోవాలని కోరారు.

ఫారం-6 ద్వారా కొత్త ఓటరు నమోదు, అర్హులైన వారి పేర్ల చేర్పు, ఫారం-7 ద్వారా అనర్హులు లేదా మరణించిన వారి పేర్ల తొలగింపు, ఫారం-8 ద్వారా పేరు, చిరునామా, వయస్సు, ఫొటో తదితర వివరాల్లో మార్పులు, సవరణలు చేసుకోవచ్చని వివరించారు.

కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని, కుటుంబ సభ్యులు, బంధువులు, పరిసర ప్రాంతాల ప్రజల్లో కూడా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్న ఆయన, ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటు హక్కును పరిరక్షించుకోవడం బాధ్యతగా భావించాలని అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ శ్రేణులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా, అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలు నిర్ణీత గడువులోగా పూర్తి చేసుకునేందుకు సహకరిస్తాయని తెలిపారు.

పుకార్లను నమ్మకుండా అధికారిక డ్రాఫ్ట్ ఓటరు జాబితాను పరిశీలించి, ఆగస్టు 30లోపు ఫారాలు-6, 7, 8 ద్వారా అవసరమైన దరఖాస్తులు సమర్పించి తమ ఓటు హక్కును భద్రపరుచుకోవాలని వై.వి. సుబ్బారావు విజ్ఞప్తి చేశారు.

## ఇంటర్ కాలేజియేట్ స్టార్టప్ పోటీల్లో ప్రతిభ చాటిన నిరంఅల ఫార్మసీ విద్యార్థినులు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఇంటర్ కాలేజియేట్ స్టార్టప్ ఈవెంట్‌లో వినూత్న ప్రాజెక్ట్‌ను ప్రదర్శించి తృతీయ బహుమతి సాధించిన నిరంఅల కళాశాల బి.ఫార్మసీ విద్యార్థినులను కళాశాల యాజమాన్యం ఘనంగా అభినందించింది.

జూలై 30న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ నిర్వహించిన స్టార్టప్ పోటీల్లో నిరంఅల కళాశాలకు చెందిన రెండో సంవత్సరం బి.ఫార్మసీ విద్యార్థినులు ఎ. భువనేశ్వరి, ఎ. గాయత్రి "ఆరోగ్య రంగంలో సైబర్ ముప్పు సమాచార భాగస్వామ్యం కోసం బ్లాక్‌చెయిన్ ఆధారిత వ్యవస్థ" అనే వినూత్న ప్రాజెక్ట్‌ను ప్రదర్శించి తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నారు.

విజేతలకు బయోఫోర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రాయోజకత్వంలో రూ.10 వేల నగదు బహుమతిని చలపతి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డా. నాదెండ్ల రామారావు అందజేశారు. ఈ సందర్భంగా సిస్టర్ నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డా. బి. పాముల రెడ్డి విజేతలను అభినందించి, విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణలు, స్టార్టప్ సంస్కృతిని పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

ఈ ప్రాజెక్ట్ విజయానికి డా. షేక్ ఫైజాన్ అలీ, ఎస్. స్వాతి అందించిన మార్గదర్శకత్వం కీలకంగా నిలిచిందని తెలిపారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా సమన్వయం చేసిన డా. యు. స్పందన, ఎం. శాంతిల సేవలను ఈ సందర్భంగా అభినందించారు.

## ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయాలను ప్రజలకు వివరించాలి

○ **రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**కోటబొమ్మాళి(జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజాదర్బార్ అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు జారీ చేశారు, మంత్రి అచ్చెన్నాయుడు ఇంటింటి ప్రచార కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కరపత్రాల ద్వారా ప్రజలకు స్పష్టంగా వివరించి, ప్రతి ఇంటి వివరాలను నిర్ణీత సమయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఇంటింటికీ చేరాలని మంత్రి సూచించారు. ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ ఫలితాలను వివరించాలని కోరారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు పారదర్శక పాలన, వేగవంతమైన అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలను వివరించి, ప్రజా మద్దతును మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వాస్తవాలతో తెలియజేస్తూనే, కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసే దిశగా కట్టుబడి పనిచేస్తోందని ప్రజలకు వివరించాలని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శక పాలన, వేగవంతమైన అభివృద్ధితో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. నందిగాం. సంతబొమ్మాళి మండలాల నాయకులు పాల్గొన్నారు.

## ఆసియా కప్ 2026.. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలో భారత జట్టు ప్రకటన



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాబోయే మహిళల ఆసియా కప్ 2026 టోర్నీ కోసం భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. అమితా శర్మ నేతృత్వంలోని మహిళల సెలక్షన్ కమిటీ ఈ జట్టును ఎంపిక చేసింది. సీనియర్ ప్లేయర్లు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా, స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. లార్డ్స్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్ తర్వాత కొంత విరామం తీసుకున్న భారత మహిళల జట్టుకు ఇదే తొలి టోర్నమెంట్.

ఈ ఆసియా కప్ ఆగస్టు చివరి వారం నుంచి సెప్టెంబర్ మధ్య వరకు జరగనుండగా, టోర్నీ నిర్వహణ తేదీలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. అత్యవసర పరిస్థితులు లేదా ఆటగాళ్ల గాయాలను దృష్టిలో ఉంచుకుని ఐదుగురు రిజర్వ్ ప్లేయర్లను కూడా కమిటీ ఎంపిక చేసింది. టీ20 ప్రపంచ కప్ జట్టులో ఉన్న శ్రేయాంక పాటిల్‌కు ఆసియా కప్ జట్టులో స్థానం దక్కలేదు. ప్రపంచ కప్2026లో ఆమె స్థానంలో వచ్చిన ప్రేమా రావత్ ఆసియా కప్ జట్టులోనూ కొనసాగింది.

37 ఏళ్ల హర్మన్‌ప్రీత్ కౌర్‌కు ఆసియా కప్‌లో ఘనమైన రికార్డు ఉంది.

ఆమె సారథ్యంలో భారత్ ఇప్పటికే 2016, 2022లలో ఆసియా కప్ టైటిళ్లను గెలుచుకోగా, 2012లో సభ్యురాలిగా విజేత జట్టులో భాగమైంది. తన సుదీర్ఘమైన కెరీర్ ముగింపు దిశగా సాగుతున్న వేళ, భారత్‌కు మరో ఆసియా కప్ అందించాలనే పట్టుదలతో ఉంది.

**భారత జట్టు:** హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షెఫాలీ వర్మ, జెమిమా రోడ్రిగ్స్, భారతి ఫుల్మాలి, దీప్తి శర్మ, రీచా ఘోష్ (వికెట్ కీపర్), జి. కమలిని (వికెట్ కీపర్), అరుంధతి రెడ్డి, ప్రేమా రావత్, రాధా యాదవ్, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, నందిని శర్మ, క్రాంతి గౌడ్.

**రిజర్వ్ ప్లేయర్లు:** ప్రతీకా రావల్, ఉమా ఛెత్రి (వికెట్ కీపర్), వైష్ణవి శర్మ, సాయలీ సత్ఘారే, మిన్ను మణి.

## రాష్ట్రానికి రూ.18 వేల కోట్ల ప్రాజెక్టులు.. ప్రధాని మోదీకి రాష్ట్ర బీజేపీ కృతజ్ఞతలు

○ **భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి మైలురాయి : బీజేపీ**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని జాతికి అంకితం చేయడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి రూ.18 వేల కోట్ల విలువైన మౌలిక వసతుల ప్రాజెక్టులను ప్రకటించడం ఆంధ్రప్రదేశ్‌కు శుభపరిణామమని బీజేపీ నేతలు అన్నారు.

గుంటూరులో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేస్తూ కర్నూలు జిల్లాలో సోలార్ విద్యుత్ ప్రాజెక్టులకు అవసరమైన సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ ఏర్పాటుకు రూ.5,500 కోట్లు, విండ్, సోలార్ ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌కు రూ.3,550 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. అనంతపురం జిల్లాలో 2,500 మెగావాట్ల విద్యుత్ ప్రసార వ్యవస్థ కోసం రూ.820 కోట్లు, విశాఖపట్నంలో సెమీకండక్టర్ తయారీ యూనిట్‌కు రూ.420 కోట్ల ప్రాజెక్టును ప్రకటించడం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

2027 చివరి నాటికి అమరావతి రాజధాని తొలి దశ పనులు పూర్తిచేసి ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, పోలవరం ప్రాజెక్టును కూడా జాతికి అంకితం చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడం సంతోషకరమని అన్నారు. భోగాపురం విమానాశ్రయంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విమర్శలను ఖండించిన దర్శనపు శ్రీనివాస్, రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలపై అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు. దేశభక్తి, అభివృద్ధి లక్ష్యాలతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి నూతన దిశానిర్దేశం చేస్తుందన్నారు. రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయం మధ్య మెరుగైన అనుసంధానం ఏర్పడి రవాణా వ్యవస్థ బలోపేతం అవుతుందని తెలిపారు. భవిష్యత్తులో సుమారు 60 లక్షల మంది ప్రయాణికులకు ఈ విమానాశ్రయం ఉపయోగపడటంతో పాటు వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, బీజేపీ సీనియర్ నాయకుడు పాలపాటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీపై సోషల్ మీడియాలో అసత్య పోస్టులు.. సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు



○ **అభ్యంతరకర ప్రచారంపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీజేపీ విజ్ఞప్తి**

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖపై సోషల్ మీడియాలో అసత్య, అభ్యంతరకర, పరువునష్టం కలిగించే పోస్టులు ప్రచారం చేస్తున్న ఫేస్‌బుక్ ఖాతాలు, పేజీలు, గ్రూపుల నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర శాఖ విజయవాడ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

శనివారం సమర్పించిన ఫిర్యాదులో, కొన్ని ఫేస్‌బుక్ ఖాతాలు, పేజీలు, గ్రూపుల ద్వారా బీజేపీ, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులను లక్ష్యంగా చేసుకుని అవమానకర, అసభ్యకర, పరువునష్టం కలిగించే పోస్టులు, వీడియోలు, వ్యాఖ్యలు ప్రచారం చేస్తున్నట్లు పేర్కొంది.

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్వరాన్ని వక్రీకరించి అభ్యంతరకర పదజాలంతో కూడిన వీడియోను సోషల్ మీడియాలో ప్రసారం చేసినట్లు కూడా ఫిర్యాదులో వివరించింది.

ఇలాంటి పోస్టులు ప్రజల్లో అపోహలు సృష్టించడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉందని, సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని బీజేపీ రాష్ట్ర శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. సంబంధిత ఫేస్‌బుక్ ఖాతాలు, పేజీలు, గ్రూపుల నిర్వాహకులను గుర్తించి, సమాచార సాంకేతిక చట్టం (ఐటీ చట్టం)తో పాటు వర్తించే ఇతర చట్టాల ప్రకారం విచారణ జరిపి తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసులను బీజేపీ రాష్ట్ర శాఖ కోరింది.

## ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో అవసరం



○ **ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 24వ డివిజన్ చుట్టుగుంట పోలేరమ్మ అమ్మవారి దేవస్థాన కల్యాణమండపంలో వికాస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్ కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పరిశీలించి, వైద్య సేవలు పొందుతున్న ప్రజలతో మమేకమయ్యారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొని, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. శిబిరంలో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, నిపుణుల సేవలను పరిశీలించారు.

అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండటం అత్యంత ముఖ్యమని అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడంతో పాటు వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించేందుకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. సమాజ ఆరోగ్య పరిరక్షణ కోసం వికాస్ హాస్పిటల్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయడంలో ఆసుపత్రి యాజమాన్యం చూపుతున్న చొరవ ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

ప్రజల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి కుటుంబానికి మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ అధ్యక్షులు తుమ్మల నాగేశ్వరరావు మరియు నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలపై కాలయాపన తగదు...సహనాన్ని పరీక్షించొద్దు

○ **చర్చలు చేసి నిర్ణయాలు ప్రకటించకుండా ప్రభుత్వం కాలయాపన**

○ **ఆగస్టు 15లోపు ఉద్యోగుల సమస్యలపై స్పష్టమైన నిర్ణయాలు ప్రకటించాలి**

○ **లేకుంటే రాష్ట్రవ్యాప్త ప్రత్యక్ష ఉద్యమం తప్పదు : ఏపీ జేఏసీ అమరావతి**



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగుల సమస్యలపై పలుమార్లు చర్చలు నిర్వహించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయాలు ప్రకటించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందనే భావన ఉద్యోగుల్లో బలపడుతోందని, ఆగస్టు 15లోపు స్పష్టమైన నిర్ణయాలు ప్రకటించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్ష ఉద్యమ కార్యాచరణ చేపడతామని ఏపీ జేఏసీ అమరావతి హెచ్చరించింది.

విజయవాడ రెవెన్యూ భవన్‌లో ఆదివారం జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర సెక్రటేరియట్ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. సమావేశంలో సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, ఉద్యమ కమిటీ చైర్మన్ టి.వి. ఫణి పేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావుతో పాటు జేఏసీలోని భాగస్వామ్య ఉద్యోగ సంఘాల రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

**చర్చలు తప్ప చర్యలేవి :** సమావేశంలో నాయకులు మాట్లాడుతూ జూలై 10, 11 తేదీల్లో ఆర్థిక, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రులతో రెండు రోజులపాటు చర్చలు జరిగాయని, అనంతరం జూలై 22న మంత్రివర్గ ఉపసంఘం అన్ని ఉద్యోగ సంఘాలతో సమావేశమైనప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయాలు వెలువడలేదన్నారు. చర్చలు నిర్వహించి నిర్ణయాలు ప్రకటించకుండా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఉద్యమాన్ని ప్రక్కదారి పట్టిస్తోందనే భావన ఉద్యోగుల్లో పెరుగుతోందని పేర్కొన్నారు.

**ఉద్యోగులకు వేల కోట్ల బకాయిలు :** బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలకు, ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం అనే నినాదానికి ప్రస్తుతం ప్రభుత్వ వైఖరి విరుద్ధంగా ఉందన్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు సుమారు రూ.28 వేల కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు సుమారు రూ.25 వేల కోట్లకు చేరుకుంటున్నాయని పేర్కొన్నారు. ఇంత భారీ బకాయిలపై ప్రభుత్వం ఇప్పటికీ మౌనం పాటించడం సమంజసం కాదన్నారు.

ఉద్యోగులు ఉచితాలు, బోనస్‌లు కోరడం లేదని, తాము పనిచేసిన కాలానికి చట్టబద్ధంగా రావాల్సిన సొమ్మును మాత్రమే కోరుతున్నామని స్పష్టం చేశారు. ఉద్యోగుల బకాయిలు చెల్లించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని, వెంటనే చెల్లించలేని పరిస్థితిలో ప్రతి ఉద్యోగికి ఎంత మొత్తం బకాయి ఉందో పే స్లిప్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

**డీఏలు, పీఆర్సీ, ఐఆర్‌పై డిమాండ్లు:** ధరల పెరుగుదలకు అనుగుణంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రకటించాల్సిన డీఏలను రెండు సంవత్సరాలుగా విడుదల చేయకపోవడం వల్ల ఉద్యోగులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. ఒకవైపు పని ఒత్తిడి, మరోవైపు పెరుగుతున్న జీవన వ్యయం కారణంగా ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

ఐదేళ్లకోసారి జరగాల్సిన వేతన సవరణ ప్రక్రియ నిలిచిపోవడంతో రాష్ట్రంలో ఇప్పటికీ 11వ పీఆర్సీ అమలులోనే ఉందని, ఉద్యోగులు ఇప్పటికే మూడు పీఆర్సీల ఆర్థిక ప్రయోజనాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పైసా ఖర్చులేని 12వ పీఆర్సీ కమిషన్ నియామకంపైనా ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడాన్ని ప్రశ్నించారు. తెలంగాణలో మూడు సంవత్సరాలుగా మధ్యంతర భృతి (ఐఆర్) అమలవుతుండగా, ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఐఆర్ ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చిన ప్రభుత్వం రెండేళ్లు గడిచినా అమలు చేయకపోవడానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**పెన్షనర్లు, హెల్త్ కార్డులపై తీవ్ర అసంతృప్తి :** విశ్రాంత ఉద్యోగులకు గతంలో అమల్లో ఉన్న 70, 75 సంవత్సరాల అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పునరుద్ధరణ, పెన్షనర్ కార్పొరేషన్ ఏర్పాటు వంటి ఎన్నికల హామీలు ఇప్పటికీ అమలు కాలేదని పేర్కొన్నారు.

అలాగే ఉద్యోగుల హెల్త్ కార్డు వ్యవస్థను ఎనిమిది వారాల్లో పూర్తి స్థాయిలో అమల్లోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేసి దాదాపు పది నెలలు గడిచినా ఇప్పటికీ అమలు జరగలేదని ప్రశ్నించారు.

**27 డిమాండ్లు ప్రభుత్వం దృష్టికి :** కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో పాటు ఇతర వర్గాల ఉద్యోగులకు సంబంధించిన మొత్తం 27 డిమాండ్లను జూలై 22న జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

**ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమమే:** సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గతంలో శ్రీకాకుళం, అనంతపురంలో నిర్వహించాల్సిన ఉద్యమ సన్నాహక సభలను వాయిదా వేసినట్లు గుర్తు చేశారు.

ఇటీవల మంత్రివర్గ ఉపసంఘం నాయకులు ప్రధానమంత్రి పర్యటన అనంతరం ముఖ్యమంత్రితో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయాలు ప్రకటిస్తామని కోరిన నేపథ్యంలో జేఏసీ ఓపికతో ఎదురుచూస్తోందన్నారు.

అయితే ఆగస్టు 15లోపు ఉద్యోగుల ఆర్థిక, సేవా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన నిర్ణయాలు వెలువడకపోతే అదే వారంలో విజయవాడలో రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్ష ఉద్యమ కార్యాచరణను ప్రకటించాలని రాష్ట్ర సెక్రటేరియట్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

సమావేశంలో టి. నాగేశ్వరరావు (ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్), ఆర్. శ్రీనివాసరావు (ఏపీ పంచాయతీరాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్), చెవూరి రవి (ఏపీ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్), పి.ఎస్.ఎస్.ఎన్.పి. శాస్త్రి (రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్), జి. శివానందరెడ్డి (లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్), సంసాని శ్రీనివాసరావు (గవర్నమెంట్ డ్రైవర్స్ అసోసియేషన్), ఎస్. మల్లేశ్వరరావు (క్లాస్-4 ఎంప్లాయీస్ అసోసియేషన్), జి. సంపత్ (ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్), బత్తిన రామకృష్ణ, ఆర్.ఎన్. దివాకర్, చి. సురేష్‌బాబు, బి. కిషోర్‌కుమార్, పారే లక్ష్మి, పొన్నూరు విజయలక్ష్మి, సైకం శివకుమార్‌రెడ్డి, డాక్టర్ సాయిలక్ష్మి, సీతామహాలక్ష్మి, వేల్పుల అర్లయ్య, రవిప్రసాద్, రామిశెట్టి వెంకటరాజేష్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467